ఆలీషా, ఖాసీం

కొండవీటిచరిత్ర

గుంటూరు, 1924

Record no. 798

Ālīṣā, Khāsīṃ

Koṇḍavīṭicaritra

Guṇṭūru, 1924

Record no. 798

ఆలీషా, ఖాసీం.
కొండవీటిచరిత్ర / ఖాసీం ఆలీషాచే రచియింపంబడినది.- 1. కూర్పు.- గుంటూరు : కన్యకా ముద్రాక్షరశాల, 1924.
ii, 52 p. ;22 cm.
Record no. 798

Ālīṣā, Khāsīṃ.
Koṇḍavīṭicaritra / Khāsīṃ Ālīṣācē raciyimpambaḍinadi.- 1. kūrpu.- Guṇṭūru : Kanyakā Mudrākṣaraśāla, 1924.
ii, 52 p. ;22 cm.
Record no. 798

సాంఘిక చరిత్ర

చరిత్ర

కొండవీటిచరిత్ర.

ఇది

గుంటూరు తాలూకా గారపాడుగ్రామనివాసి యగు

ఖాసీం ఆలీషా చే

రచియింపఁబడినది.

మొదటి కూర్పు 1000 ప్రతులు.

గుంటూరు

కన్యకా ముద్రాక్షరశాలయందు

ముద్రింపఁబడియె.

1924

[వెల రు. 0-8-0.

కొండవీటి చరిత్ర.

ఇది

గుంటూరు తాలూకా గోరంట్లపాడుగ్రామ నివాసి యగు

ఖాసీం ఆలీషాచే

రచియింపఁబడినది.

మొదటి కూర్పు 1000 ప్రతులు.

గుంటూరు

కన్యకా ముద్రాక్షరశాలయందు

ముద్రింపఁబడియె.

1924

[వెల రు. **0-8-0.**

అవతారిక

ఆంధ్రరాష్ట్రంబునందుఁ బ్రసిద్ధంబగు దుర్గరాజమైన కొండవీటిని నేను పల్మాఱు ప్రాయికముగా సందర్శించుటంజేసి యాపురచరిత్రంబు ప్రత్యేకముగా, వ్యాసరూపముగా, సంగ్రహముగా వ్రాయవలెనని తలంచి చరిత్ర శాసన పరిశోధన లెఱింగినంతవఱకుఁజేసి యేయేరాజెంతవఱ కీకొండవీటిరాజ్యమును బాలించినదియు నాయా రాజులయొద్ద నేయే కవీశ్వరులుండి యేయేగ్రంథములు రచించి యాంధ్రభాషాయోషామణి నత్యంత గౌరవస్థానమునందుంచినదియు నించుక చర్చాపూర్వకముగాఁ జర్చించి యొకవ్యాసమును రచించితిని. ఆవ్యాసమును మా మిత్రులు కొందఱుచూచి సంతసించి యందందు సందర్భానుసారముగాఁ దత్సంబంధంబులగు పద్యరత్నంబులఁ బొందుపఱిచి గ్రంథరూపంబునఁ బ్రకటింపవలెనని కోరిరి. నేనందులకొల్లే సమ్మతించి యిదివఱకే పెక్కుగ్రంథములందుఁ బ్రచురించినను నాచితికై భ్రమించి పిష్టపేషణమనుకొనక కర్ణానందకరంబులగు పద్యకుందంబు లందం దను సంధించితిని. అందులకై తత్సంపాదకులకుఁ గృతజ్ఞతాభివందనము లర్పించెదను.

కొండవీటిదుర్గము రెడ్డిరాజులవలననే కట్టఁబడి యాకాలము నుండియే కొండవీటిరాజ్యమని ప్రత్యేకించి వ్యవహరింపఁబడుచున్నందున నప్పటికాలమే చరిత్రకుఁ బ్రథమముగాఁ బరిగణించితిని.

వేమనయోగి జీవితము శ్రీరాయవరపు పూర్ణయాచార్యులుగారు సమకూర్చిన వేమనసూక్తిరత్నాకరము నుండియు, శ్రీపంచాగ్నుల ఆదినారాయణశాస్త్రిగారిచే రచియింపఁబడిన వేమనజీవితము నుండియు గ్రహించితిని. సామాన్యవిద్యావంతులకు సైతము సులభముగా బోధపడుటకై దీర్ఘసమాసంబుల పొంతంబోవక పరుషసరళ నియమంబులఁ బాటింపక దుస్సంధుల నిరీక్షింపక యచ్చటచ్చట లక్షణోల్లంఘనము గావించితిని. భాషాభిమానులు మన్నింతురుగాత.

నేటికిని జెక్కుచెదరక నిన్ననో, మొన్ననో నిర్మించినట్లుండి చరిత్రాన్వేషుల చిత్తంబు జల్లుమనంజేయు చీఁకటికోనేరు, శిలాపీఠము మొదలైన విచిత్రంబులగు కట్టడములపటములు తీయించివేయవలెనని యుఁ, దత్తన్మండలాధిపులగుజమీందారుల చరిత్రంబులు వేరుగ వ్రాయవలెననియుఁ బ్రయత్నించి కొన్నికారణములచేఁ బ్రస్తుత మా యుద్యమ మాపితిని. స్వదేశచరిత్రానురాగులగు నాంధ్రజనులు దీని నాదరించినచో రెండవకూర్పునందు నాకార్యము నిర్వహించెదను. నే నీచరిత్ర వ్రాయునపుడు నా కనేక విషయములందు సహాయులైనవారును, సర్వకాల సర్వావస్థలయందు మచ్ఛ్రేయోభిలాషులగు వారును, సహజశాంతస్వభావులును, నామేనత్త కుమారులునగు శ్రీయుత లాలాహమ్మద్ సాహెబుగారి దివ్యపాదారవిందములకు వందన శతంబు లొనర్చెద.

పెద్దలగు సుధీవరు లిందుఁగల భాషావిషయకములును, జరిత్రసంబంధములు నగు దోషములున్నఁ దెలిపినచో భక్తిపూర్వకముగా నందుకొని దిద్దుకొనియెదను.

గారపాడు.
19-2-24.

ఇట్లు విబుధజనవిధేయుఁడు,
ఖాసీం ఆలీసా.

కొండవీటి చరిత్ర

"అల్లాయుద్దీ" నను ఢిల్లీచక్రవర్తి కాకతీయసామ్రాజ్యాధిపతి యగు కడపటి ప్రతాపరుద్రుని క్రీ॥ శ॥ 1323 వ సంవత్సరమున జయించెను. అప్పుడు ప్రతాపరుద్రుని కడ దండనాథులుగానున్న రెడ్డివారు, వెలమవారు, మొదలగువారు స్వతంత్రించి రాజ్యముల నేర్పఱచుకొని యాంధ్రరాష్ట్రము నేలిరి. అట్టివారిలో రెడ్డివారు ప్రముఖులు. వీరికి అద్దంకి కొండవీడు రాష్ట్రప్రధాన పట్టణములు. వీరలార్గురుచక్రవర్తులు. నూరు సంవత్సరములు నిరంకుశాధికారులై జగద్విదిత యశోవిశాలురై సర్వజనశ్లాఘాపాత్రులై పరిపాలన మొనర్చిరి.

సీ॥ ప్రోలయవేమన్న పోలుపారఁ బన్రెండు
వత్సరంబులు గాచె వసుధ యెల్ల
అటవెన్క ముప్పది యనపోతవేమన్న
వన్నె వాసికి నెక్క వసుధ యేలె
ధర్మాత్ముఁ డనవేమధరణీకళత్రుండు
పదియునేనిట భూమి వదిలపరిచె
ప్రజల కుబ్బసముగఁ బదునాలుగేడులు
కొమరుగిరే లెను సమయుదాఁక
తే॥ యేలెఁ గోమటి వేమన యిరువదేండ్లు
రాచవేమన్న నాల్గు వర్షములు నేలె
మించికట్టిరి గృహరాజు మేడకొండ
వీట నూరేండ్లు రెడ్లు భూవిదితయశులు.

ఈపద్యము రెడ్డిరాజుల రాజ్య పరిపాలనము నూరేండ్లని బోధించుచున్నప్పటికిని, నాయారాజు లేలిన కాలపరిమితికి మాత్రము వ్యతిరేకమై కనుపట్టుచున్నది.

రెడ్డిరాజుల యింటిపేరు.

దొంతివారని దండకవిలె మొదలగు గ్రంథములందుఁ జెప్పఁబడినను రెడ్డి సంస్థానములందుఁ గవులగు నెఱ్ఱాప్రెగ్గడ, శ్రీనాథుఁడును రామాయణ హరివంశ, హరవిలాస, కాశీఖండములందు దేసటి వేమాయనియుఁ బంటకుల స్వామియనియు, నుగ్గడించుటచే, వీరు పంటరెడ్లనియు వీరి యింటిపేరు దేసటివారనియుఁ జరిత్రజ్ఞులచే దృఢీకరింపఁబడియె.

రెడ్డిరాజులు కోమటిశబ్ద ముపయోగించినందులకు.

రెడ్డిరాజులకు మూలపూరుషుఁడగు దొంతి యలియరెడ్డి యనువానియింటి కొకానొకప్పు డొకకోమటి వేమనయను మహాపురుషుఁడు వచ్చి స్పర్శవేదిచే నింపఁబడిన తన కావడిని అలియరెడ్డి యింటియందుఁ బెట్టి భోజనమునకై గ్రామములోనికిఁ బోయెనఁట. అంతటఁ గోమటి కావడియందున్న స్పర్శవేదిని గ్రహింపవలెనను దురుద్దేశముతో స్పర్శవేదిని దొంగిలించి యింటికి నిప్పునంటించి తగులఁబెట్టెనఁట. ఇంతలోఁ గోమటివచ్చి తనకావడి యేమైనదని యడుగ, గృహముతోనే దహింపఁబడెనని చెప్పఁగా నంతటి స్పర్శవేదియే పోయినయెడల నాబ్రతు కేందులకని తాను సిద్ధపురుషుం డయ్యు నత్యంతముగా దుఃఖించి ఆత్మహత్య పాపంబను, నార్యోక్తి కేని వెరువక మండుచున్న మంటయందుఁబడి ప్రాణముల విడిచెనఁట. తరువాతఁ గొంతకాలమునకు స్వప్నమందు రెడ్డికిఁ గనుపించి నాస్పర్శవేదివలన సంపాదించిన ధనము ధర్మకార్యార్థమై వినియోగించి కోమటి వేమనయను పేరు మీ వంశ పరంపరంగాఁ బెట్టుకొనిన నవక్ర విక్రమాతిశయంబున జగద్విదిత యశస్కులరై నూరుసంవత్సరములు రాజ్యమేలఁగలరనియు, నట్లుకానిచో వంశక్షయమై పోవుననియు శపించెనఁట. అంతట నా స్పర్శవేదిచే విశేషధనమార్జింపఁబడి బహుభూములాక్రమించి, కాకతీయసామ్రాజ్యాధిపతులయొద్ద దండనాయక పదవి నార్జించి క్రమక్రమముగా స్వరాజ్యప్రతిష్ఠఁ గావించెనని దండకవిలె శాసించుటేగాక

బహుజనప్రతీతియు నట్లే గలదు. నేఁటి నవనాగరికు లీకథ నమ్మినను, నమ్మకుండిన నీ రెడ్డివంశజులు సామాన్యులుగానుండి యొక్కే పర్యాయము రాజ్యస్థాపనఁ గావింపక రాజులకడ దండనాథాదిపదవులలోనుండి, తద్రాజవంశక్షయానంతరము తామే రాజులైరనిమాత్ర మొప్పుకొనక తప్పదు.

ప్రోలయవేమారెడ్డి.

కాకతీయ సామ్రాజ్య మస్తమించినవెనుక ప్రతాపరుద్రుని దండనాథుఁడగు ప్రోలయవేమారెడ్డి అద్దంకి రాజధానిగాఁ జేసికొని నూతనరాజ్యము స్థాపించినాఁడు. ఈతఁడు కొండవీడు, కొండపల్లి ధాన్యవాటి మొదలగు స్థలములందు చౌసీతిదుర్గముల నిర్మించి స్వబంధుల నాయామదుర్గములనుంచి యర్థి ప్రత్యర్థి హేమాద్రి దాననిరత, నిత్యపరిపాలిత సత్యప్రజ్ఞాచతుర్విధోపాయ, ప్రభృతిమహాబిరుదు లనేకముఁ బొంది కాశ్యపగోత్రుఁడును, నియోగిబ్రాహ్మణవరుఁడును నగు రామాప్రెగ్గడాది దైవజ్ఞ శిఖామణులు మంత్రులై కొలువ కుమారుఁడనపోతారెడ్డియుఁ దమ్ములన్నారెడ్డి మల్లారెడ్డి మొదలగు వీరవరులు సేనాధిపతులై సేవింప నిర్వక్రపరాక్రమాతిశయంబుల బహుభూములాక్రమించి 1324 మొదలు 1350 వరకు ప్రజాహిత పరిపాలనం బొనర్చెను. మరియు నిమ్మహాత్ముఁడు నానావిధములైన దానములఁ బండిత శిరోమణులకును బ్రాహ్మణప్రవరులకొసంగి బహుతరముగా స్తోత్రపాత్రుఁడగుటయే గాక శంభుదాసప్రబంధ పరమేశ్వరాది మహాబిరుదాంకితుఁడును, గవిత్రయమందుఁ గడపటివాఁడును నగు చెదలువాడ యెఱ్ఱాప్రెగ్గడ మహాకవీంద్రుని దమ యాస్థానంబునందుంచుకొని రామాయణ హరివంశములను నాంధ్రప్రబంధముల కంకితమందినాఁడు. రాష్ట్రప్రజల సౌకర్యార్థమై పంటచెరువులు, భావులు త్రవ్వించెను. హిందూదేశమునఁ బుణ్యస్థలంబులని పేర్వోలసిన శ్రీశైలమునకును, నహోబల పర్వతమునకును సోపానములు కట్టించి తీర్థవాసులకుఁ బూజనీయుఁడయ్యెను. ఈ వేమారెడ్డికి, అనపోతారెడ్డి, అనవేమారెడ్డి, కోమటి వేమారెడ్డి యను ముగ్గురు కుమాళ్ళును దొడ్డాంబిక,

వేమాంబిక యను నిరువురు పుత్రికలును గలరు. దొడ్డాంబికను, కాటయరెడ్డికిని, వేమాంబికను నల్లనూకయరెడ్డికి నిచ్చి వివాహమొనర్చెను.

అనపోతారెడ్డి.

ప్రోలయవేమనకుఁ దరువాత నాతని పెద్దకుమారుఁ డనపోతారెడ్డి సింహాసనారూఢుఁడై 1350 మొదలు 1362 వరకు రాజుగా నుండెను. ఇతనియొద్ద మల్లినాథుఁడును సోమయామాత్యుఁడును మంత్రులుగా నుండిరి. ఇతని తమ్ముఁడగు అనవేమారెడ్డియుఁ బ్రథమ సోదరి దొడ్డాంబిక భర్తయగు కాటయరెడ్డియు, ద్వితీయసోదరి వేమాంబిక భర్తయగు నల్లనూకరెడ్డియుఁ బ్రసిద్ధసేనానులై యుండి యీ యనపోత భూభర్త కనేకయుద్ధములందు సంపూర్ణవిజయము సంపాదించిరి. తనతండ్రివలెనే యీతఁడు పలువిధములగు దానములిచ్చి పండితులను గవులను గాపాడి కొన్ని గ్రంథము లంకితమందెను. ఒకానొక సమయమం దీయనపోతరెడ్డిని రేచెర్ల వెలమరాజగు సింగయమాదానేఁడు ధరణికోటయొద్ద యుద్ధమొనర్చి పాఱఁదరిమెను.

ఉ॥ దన్నడకోటముంగల నుదగ్రబలోన్నతి గంగదాఁటి సం
పన్నబలుండు సింగజనపాలునిమాదఁడు రెడ్డిపోతనిన్
బన్నినసేనలం దునిమి పాఱఁగఁదోలె విరాటువీట న
త్యున్నతి విక్రమంబున సుయోధనుదోలు కిరీటికైవడిన్.

ఈ యనపోతరెడ్డి రాజ్యపరిపాలనమునఁ బ్రశంసనీయంబులగు విశేషములు పెక్కులుగలవు. ఇతఁడు తనరాజ్యంబున నౌకావ్యాపారము వృద్ధిచేసి మండలంబు భాగ్యవంతముగా నొనరించెను. ప్రజలకుఁ గష్టమని తోఁచుపన్నులన్నిటిని దీసివేసెను. రాష్ట్రజనోపయోగమునకై వివిధములగు పాలనాశాఖ లేర్పఱచి స్వేచ్ఛాజీవనులై ప్రజలెల్లరు వర్ధిలునట్లు నెమ్మదిగా నేలెను. సర్వవిధంబుల నితని పరిపాలనావిధాన మత్యంత స్తోత్రపాత్రమైనది. ప్రోలయ వేమారెడ్డి కాలమున నద్దంకి రాజధానిగా నుండెనని చెప్పితిమి. అట్లుండుటవలన రాచకొండ, రాజ

ధానిగా రాజ్యమేలుచున్న వెలిగోటి వెలమరాజులు మాటిమాటి కీయనపోతరెడ్డితోఁ బోరికై కడంగుచున్నందున వారితాకుడు నివారించుటకొఱకు నీతఁడు తన రాజధాని నద్దంకినుండి కొండవీటి దుర్గమునకు మార్చుకొనినాఁడు. నాఁడు మొదలు రెడ్డిరాజుల కెల్లరికిని గొండవీటి దుర్గమే రాష్ట్రప్రధానపట్టణమై యున్నది.

అనవేమారెడ్డి.

అనపోతభూపాలుని కుమారుఁడు కుమారగిరివేమారెడ్డి బాలుఁడగుటవలనఁ బ్రథమవేమభూపాలుని రెండవకుమారుఁడు, అనవేమారెడ్డి 1362 సం॥ సింహాసన మలంకరించి 1380 వరకు ధర్మవేమన యను ప్రఖ్యాతితో రాజ్యమేలెను. ఇతని పరిపాలనా కాలమునందు రాచకొండ, దేవరకొండ, దుర్గముల కధ్యక్షులగు అనపోతనాయుఁడు మాధవనాయుఁడు ప్రబలవిరోధులై రెడ్డిరాజ్యంబు నపహరించవలెనని పెక్కుమారులు దండయాత్రలు సలిపి యితనితో యుద్ధములకై కడంగి జయింపలేక విఫలమనోరథులగుటవలన నీయనవేమభూపాలుని శౌర్యప్రతాపకీర్త్యాదులు దశ దిశాంగణములందుఁ దాండవమాడి వైరివీరుల గుండియలలో గాలములై నాటుచుండెను. ఈతని యాస్థానమునందు బాల సరస్వతియను కవి విద్యాధికారిగను, త్రిలోచనాచార్యుఁడను కవితల్లజుఁ డింకొకఁడు శాసనరచయితగను, మామిడిపెద్దనామాత్యుఁడు మంత్రిగను నుండిరి. ఈరెడ్డిచక్రవర్తి మహాధర్మాత్ముఁడును బ్రతాపశాలియును నగుటవలన మన యాంధ్రకవీంద్రు లీతని నీవిధముగా స్తుతించినారు.

కం॥ కవితాకన్యకు నలుగురు కవి జనకుఁడు, భట్టు దాది గణుతింపంగా
నవరసరసికుఁడె పెనిమిటి యవివేకియె తోడబుట్టు వనవేమనృపా !

కం॥ కొంచెము జగములలోపల
నంచితమగు నీదుకీర్తి యనవేమనృపా !
మించెను గరి ముకురంబునఁ
బంచాక్షరిలోన శివుఁడు బలిసినభంగిన్.

తే॥ పందికొమ్మెక్కి పెనుపాము పగడనెక్కి
మేటితాబేటి వీఁపెక్కి మెట్టయెక్కి
విసివి వేసారి యనవేమవిభుని జేరి
రాణివాసంబు గతిమించె రత్నగర్భ.

బా॥ భద్రత్యాగగుణాయు బాహావకళా ప్రస్ఫూర్తిఁ గోదండ సం
పద్రేఖాకృతి నన్నవేమనృపతిన్ భాషింతునీ భూమి నే
భద్రేభాంతకు భానుపుత్రు భరతున్ భాషాప్రియున్ భార్గవున్
భద్రున్ భాను భగీరథున్ భవసుతున్ భంగోద్భవున్ భావజున్

సీ॥ పావకపరమేష్ఠి పవన పారావార
పాకశాసనులు నీ పాటివారు
కందర్పకాశ్యపీ కమలాధిపతికర్ణ
కాలకంధరులు నీ కరణివారు
యామినీశయయాతి యాదోధిపతియక్ష
యమతనూభవులు నీ యంతవారు
తపన తాటకవైరి తాలంకతారాద్రి
తారకాంతకులు నీ తరమువారు
తే॥ శుద్ధమతిరయ గాంభీర్య వృద్ధిరూప
శాంతి కరుణావితరభూతి కాంతిభాగ్య
సారధనధర్మ తేజోతిశౌర్య ధైర్య
భుజబలంబుల ననవేమ భూపవర్య.

కుమారగిరి వేమారెడ్డి.

కుమారగిరి వేమారెడ్డి యనపోతభూపాలుని కుమారుఁడు. 1380 మొదలు 1400 వరకుఁ గొండవీటిరాజ్యము పరిపాలనఁ జేసెను. ఇతఁడు ప్రత్యహాభోగ పరాయణుఁడు. ఈరెడ్డిభూపాలుఁడు విశేషముగా విద్వద్గోష్ఠియందును బ్రతివత్సర వసంతోత్సవములందును గాలముగడపుచు రాజ్యభార నిర్వాహక కార్యక్రమమందుఁ గొంచెము ప్రాలుమాలిక గలవాఁడై ప్రవర్తించుచుండెను. అయినను వీనిసోదరి

మల్లాంబిక భర్తయు, వదాన్య చింతామణియు, రసికశిఖామణియుఁ, బ్రఖ్యాతబలతేజోదవానలుఁడు నగు కాటయ వేమారెడ్డి మంత్రిగను సైన్యాధిపతిగను, నుండుటచేఁ బ్రజాపరిపాలనావిధానమునకుఁ గాని, దేవిడీలోని నడవడికలందుఁ గాని యెట్టిలోపమును లేక యథాప్రకారముగా సాఁగుచుండెను. పేరునకుమాత్రము కుమారగిరి వేమారెడ్డి రాజైనను సామ్రాజ్య సంబంధములగు సర్వ వ్యాపారములకు స్వతంత్రుఁడు కాటయ వేమారెడ్డియే ? ఈతఁడును దమ పూర్వికులవలెనే యనేక దానములు చేసి సొంతముగా వసంతరాజీయమను నాట్యశాస్త్రమును సంస్కృతమున రచించెను. ఈతఁడు విశేషించి వసంతోత్సవములు చేయుటచేతఁ దత్కృతంబగు నాట్యశాస్త్రమునకు వసంతరాజీయమనియుఁ దనకు వసంతరాజనియు గౌరవనామములు. కాటయ వేమారెడ్డి, తనకనేకవిధముల సాయపడినవాఁడు గావున నతనికిఁ దనరాజ్యమునుండి విభాగించి రాజమహేంద్రవర మిచ్చినాఁడు. అది మొదలీ రాజమహేంద్రవర రాజ్యమున నీకాటయ వేమారెడ్డి సంబంధికులే యేలుచుండిరి.

పెదకోమటి వేమారెడ్డి.

కుమారగిరి వేమారెడ్డి యనంతర మీకొండవీటి రాజ్యమును బాలించినది పెదకోమటి వేమారెడ్డి. ఈయన ప్రోలయవేమారెడ్డికిఁ బుత్రుఁడైన మాచారెడ్డికి మనుమఁడు. ధర్మశాస్త్ర ప్రకారము వంశక్రమాగతంబు కావలసిన తమ రాజ్యంబుఁ గుమారగిరి వేమారెడ్డివలన నన్యాయముగాఁ గోరను మచ్చరముచేత రాజమహేంద్రవరపు రెడ్డిరాజులతోఁ గలహించి తద్రాజ్యమునుండి వారిని దొలఁగింపవలెనని విశ్వప్రయత్నములు చేసి వ్యర్థమనోరథుఁడయ్యెను. కాని యీతఁడు పలుమారు కర్ణాట రాజ్యాధిపతుల నోడించి స్వపరాక్రమాతిశయంబులఁ బ్రపంచమునఁ బ్రకటించిన ధీరమూర్తి కావున నొక పూర్వకవి యిట్లభివర్ణించినాఁడు.

సీ॥ కపట కంఠీరవాకార నారాయణ
క్ష్వేళానినాదంబు గేలిసేయు
కల్పాంత దుర్దాంత కాలభైరవభేరి
ఢమరుకోన్మాదం బడఁగఁజేయు
ప్రళయకాలాభీల పటుఘోర నిర్ఘాత
పటుపుటారావంబు జటులపరచు
కుహనా మహాకాల కోలాహలోత్తాల
పాతాళనినదంబు భంగపరచు

తే॥ గండుమెఱసిన రిపుకోటి గుండెలవియు
చండగతిమ్రోయు నీరణోద్దండభేరి
జయ రమానంగ రాయవేశ్యాభుజంగ
అతుల బలధామ పెదకోమటన్న వేమ॥

ఇతఁడు పరాక్రమశాలి యగుటేగాక తమ పూర్వికులవలెనే పండితులను గవులను దమయాస్థానంబునం దుంచుకొని పోషించెను. అమరుశతక వ్యాఖ్య సాహిత్యచింతామణ్యాది పెక్కు కృతులు రచించి సర్వజ్ఞ చక్రవర్తియను బిరుదు వడసెను. ఈ వేమారెడ్డికడ అభినవ భట్టబాణబిరుదాంకితుఁడైన వామనభట్టు ఆస్థానకవిగను సకల విద్యాసనాథుండగు శ్రీనాథుండు విద్యాధికారిగను నుండిరి. అన వేమభూపాలునికడ మంత్రిగానున్న మామిడి పెద్దనామాత్యుని కుమారుఁడును, శ్రీనాథుని కాశ్రయుఁడును, నాంధ్రనైషధ మహాకృతి భర్తయు, సోమసిద్ధాంత వ్యాఖ్యాతయు నగు సింగనామాత్యుఁడు ప్రధానమంత్రిగా నుండెను. మరియు నీ కోమటి వేమారెడ్డి యాస్థానమునఁ దురగారామనయను దుష్టుఁడగు మఱియొక మంత్రియుండెను.

కం॥ కోమటి వేమన త్యాగము భూమిప్రసిద్ధంబు, కల్పభూజము చెంతన్
బామున్నపగిది, తురగా రాముం డున్నాఁడు చేరరా దెవ్వరికిన్॥

ఈయనకు రాచవేమారెడ్డి వేమారెడ్డి యను నిరువురు పుత్రులు గలరు.

రాచవేమారెడ్డి.

పెదకోమటి వేమభూపాలుని తరువాత నతని పుత్త్రుఁడగు రాచవేమన 1420 మొదలు 1424 వరకు రాజ్యభారము వహించెను. ఇతఁడు తన తండ్రితాతల మార్గమును వదలి నూతన పరిపాలనా పద్ధతిఁ బ్రవేశపెట్టి క్రొత్తపన్నుల విధించి ప్రజ కసూయాపరుఁడై పాలించుచుండుటచేతఁ గర్ణాట దేశమేలుచున్న యాదవ రాజగు ప్రౌఢ దేవరాయ లీరాచవేమనను జయించి 1425 ప్రాంతమునఁ గొండవీటి రాజ్యమును దనరాజ్యములోఁ జేర్చుకొనెను. నాఁటితో కొండవీటి రెడ్ల ధర్మపరిపాలన మంతమొందినది. ఆంధ్ర కవీంద్రుల యాశాపాశము లడుగంటినవి.

శ్రీమద్వేమనానందస్వామి.

పెదకోమటి వేమభూపాలుని కిరువురు పుత్త్రులని చెప్పితిని. అందు జ్యేష్ఠుఁడగు రాచవేమన రాజ్యమేలుచుండెను. రెండవ వేమనయే జగత్ప్రసిద్ధుండగు వేమనానందస్వామి. ఈయన ప్రాయంబునఁ గేవల విషయేచ్ఛాలంపటుండై యొకవేశ్యనుంచుకొని యావారవనిత యిల్లే తనయిల్లుగానెంచి యహర్నిశము నచ్చటనేయుండి యప్పుడప్పుడాకలెత్తినపుడు మాత్రమింటికి వచ్చుచుఁబోవుచుండెను.

కం॥ టక్కరులఁ గూడి తిరుగుచు
నెక్కుడు కాలంబు జ్ఞాన మెఱుఁగఁగ లేకే
నొక్క వెలయాలిపొందే
మిక్కిలి మోక్షమ్మటంచు మెలఁగితి వేమా॥

తననుగు [illegible]

[illegible] యప్పుడప్పు [illegible] ప్రయత్నములు

చేయుచు మఱేది తిన్నర్థించు దానినెల్ల నిచ్చుచుండును. ఇట్లుండఁగా నొకనాఁడు వారకాంతయింటి పడకగదిలో వేమన పర్యంకముపైఁ బవ్వళించియుండ మీవదినెగారు ధరించుకొనెడి నగలన్నియు నాకుఁ దెచ్చియిచ్చిన నేను వానిని ధరించుకొని యద్దములోఁ జూచుకొని సంతోషించెదను. మీరు నన్నుఁజూచి యానందింపవచ్చును, గావునఁ దెచ్చియిండని వేశ్య వేమనను గోరఁగా వేమన సమ్మతించెను. అటు తరువాతఁ గొన్నినాళ్ళకు దసరాపండుగరాఁగా నరసాంబారాణి తనకుఁగల నగలన్నియు నలంకరించుకొనియుండె. అప్పుడు వేమనచూచి తన వేశ్యయాజ్ఞఁదలఁచి "అమ్మా! నీ యీ యాభరణము లన్నియు నాకొకమాటు దయచేయుము, నేను వీనిని నావేశ్యకుఁ బెట్టిచూచి యానందించి వెంటనే తెచ్చియిచ్చెద ననెను. నరసాంబ వల్లెయని బులాకితప్ప యాభరణము లన్నియు నిచ్చెను. వేమన వేగిరము తీసికొనిపోయి వారవనితకీయ నామె వానిని ధరించి బులాకియేదని యడిగెను. వేమన బులాకి చాల వెలగలది, చీఁకటిలో దీపమువలె మెరయుచుండును, అట్టిదాని నేనడుగనైతి నని వేశ్యతోననెను.

అందులకు వేశ్య యెట్లేని యాబులాకి తెచ్చియిచ్చిన సరే లేనిచో నన్ను వదలుకోవలెనని చెప్పెను. అందులకు వేమన విచారముతో స్వగృహంబున కేగి మంచములో నిర్జీవివలెఁ బండెను. నరసాంబారాణి మఱేదిస్థితిగ్రహించి అబ్బాయీ! యేమి విచారపడుచుంటి వనెను.

అంతట వేమన వేశ్యయాజ్ఞ నెఱిఁగింప సంకోచించుచు వది నెతో [illegible] ఇదే గ్రహింపుమని [illegible] వస్త్రహీనను [illegible] చేయించుకొని [illegible] నేను [illegible] విషయేచ్ఛాలంపటుఁడైనను దన వదిన [illegible] మెఱుఁగఁడు. కావున బులాకి వేశ్య కిచ్చు వస్త్రహీనురాలుగఁ [illegible]

సీ॥ నావదినెయు నాఁడు నవరత్నభూషణ
ములు ధరించిన యంద మలరఁజూచి
యాభూషణములు వారాంగన కేఁబెట్ట
వలెనని తోఁచి నావదినెకడకుఁ
జనియు నీకున్న భూషణము లిమ్మని యన్న
నడ్డబాసయె తక్క నన్నియొసఁగె
ముక్కుభూషణ మది ముఖ్యమైనది దాని
నీకున్నఁ బ్రాణమ్ము లేగునంటి
తే॥ నట్టులైనను గొనిపొమ్మ యనుచు నిచ్చి
యెల్ల వెలయాలి కీభూషణము లిడియుఁ
జీర రవికయు విడిపింపఁజేసి చూడు
మసియె నటుచేయ రోసె నామనసు వేమ!

తే॥ రోతపుట్టెను మగువపైఁ బ్రీతిదొలఁగె
నాఁటినుండియు నాకేమి పాటులేమి
కాలమును బుచ్చ నాకర్మశాలయందుఁ
గూరుచుండఁగఁ గూడె నీగురుఁడు వేమ॥

తత్క్షణమే వేశ్యను వదలి కోటలోని స్వగృహంబునకేగి యొక గదిలోఁ బరుండి యుండెను. తరువాత భోజనసమయ మతిక్రమించి నప్పటికి వేమన రాలేదని నరసాంబారాణి యొక భటుని వేశ్య యింటి కంపె. అతఁడరిగి యయ్యెడలేనందునఁ దిరిగివచ్చి వేమన వేశ్యయింట లేఁడని చెప్పెను. అంతట నింటిలో నేగదిలోనైనఁ బరుండెనేమో యని యొకగదిలోనికిఁ బోయి చూచిన వేమన పరుండియే యుండెను. అప్పుడు రాణి వీని స్థితిగతు లరసి నాఁటితో నతసికి జ్ఞానమబ్బినట్లు గ్రహించి అంతవాని నబ్బాయీ! భోజనమునకు లెమ్మని లేపి యామె పాకశాలకు వెళ్ళెను.

తదనంతరము వేమన భోజనముచేసి వేశ్యయింటికేగక యేవిధముగాఁ బ్రొద్దుపోవునని యోజించి కోటలో బంగారపుపనిచేయు దు

కాణములోఁ గూర్చుండఁదలఁచి యక్కడికేగెను. అచ్చట విశ్వబ్రాహ్మణులయిన కొండవీటి అభిరామయ్య యతని తమ్ముఁడు లక్ష్మయ్యయుఁ బనిచేయుచుందురు. అప్పుడచ్చట లక్ష్మయ్య మాత్రమే పనిచేయుచుండెను. 'మీయన్న యింకను రాలేదా?'యని లక్ష్మయ్యను వేమన యడుగఁగాఁ గొంచెమాలస్యముగావచ్చునని యతఁడు చెప్పెను. అటు తరువాత నభిరామయ్య వచ్చువరకు జాముప్రొద్దెక్కఁగా నభిరామయ్యనుజూచి వేమన యింత యాలస్యముచేసినఁ బనులెట్లగునని కోపముగాఁ బలుక చిత్తము చిత్తమని యభిరామయ్య రాజభక్తిఁ బ్రకటించెను. వేమన రాజకీయమం దేజోక్యము కలుగఁజేసికొనక యెల్లపుడు బంగారపుపనిచేయు దుకాణమందే గూర్చుండి అభిరామయ్య ప్రతిదిన మాలస్యముగా వచ్చుచున్నందునఁ గోపించుచునే యుండెను. ఇట్లు కొన్నిదినములు గడచినపిమ్మట అభిరామయ్య యెన్నిపర్యాయములు చెప్పినను నాలస్యముగానే వచ్చుచున్నందున గట్టిగాఁ గోపపడెను. అంతట అభిరామయ్య అయ్యా నాకు ప్రతిదినముదయము స్నానసంధ్యాజపతపములున్నందున నాలస్యమగుచున్నది. కనుక జాము ప్రొద్దెక్కువరకు నన్ను మన్నింపవలెనని ప్రార్థించెను. అందులకు వేమన అట్లు కాదనియు, నిర్దిష్టకాలము లోపుగనే నిత్యకృత్యముల నెరవేర్చుకొని రావలెననియు నాజ్ఞాపించెను. ఈవిషయము రాజునకుఁదెలిసి వేమనను మంతలించెను. తరువాత వేమన యభిరామయ్య యాలస్యముగావచ్చుటకుఁ గారణము కనుగొనవలెనని

క॥ ప్రతిదినమును నుదయమ్మున మితకాలము లెక్కగొనక మీఱిపనికిరా
గతమేమియనుచు రామయ బ్రత మరయఁగఁ గంటి నిట్టివాసిని వేమా!

ఒకనాఁడు వేకువను లేచి అభిరామయ్యయింటియొద్దనున్న చింతచెట్టునెక్కి దాగియుండి యభిరామయ్య చెంబు చేతఁబట్టుకొని పోవుచుండఁగా వెనువెంటనే వేమనయుఁ గదలిపోవుచుండెను. అభిరామయ్య కొంతదూరమరిగి నిత్యకృత్యములఁ దీర్చుకొని కొలనులోఁ బాదప్రక్షాళనసమ్మార్జనస్నానములుచేసి బట్టలుతికి యారవేసికొని,

కట్టుకొని, బిళ్ళగోచిపెట్టి, జుట్టువేళ్ళుముడివైచుకొని, పైబట్ట నడుమునకుఁగట్టి, యక్కడనున్న పూఁదోటలోఁబువ్వులుగోసి చెంబునిండ నింపుకొని యక్కడకుఁ గొంచెము దూరముగాఁగల యొకకొండగుహలోఁ గూర్చుండి తపంబాచరించుచున్న లంబికాశివయోగిముం దాచెంబుఁ బెట్టి నమస్కరించి నిలిచియుండఁగా

సీ॥ బ్రహ్మాండమందును భాసిల్లుచుండెడి
కొండవీడాఖ్యచేఁ గొమరుమిగిలి
దేవఘూతంబుల దేవాలయంబుల
దేవతల్ తపసులం దేజరిల్ల
చిన్మయలంబికా శివయోగివరునకు
సచ్ఛిష్యుఁడగు రామచ్ఛాత్రవరుఁడు
అరుణోదయస్నాన మైనపిమ్మటఁ దాను
పుష్పముల్ గొని చని పూజకెచ్చు
తే॥ సతత మిటుచేయ సిద్ధుండు సంతసించు
నిట్లు గురుసేవ చిరకాలమెనయచేయ
ఫలము లభియించుకాలంబు ప్రాప్తమయ్యెఁ
దప్పె పూర్వకృతం బేమిచెప్ప వేమ!

యోగివరుండు కన్నులు విప్పిచూచి "వత్స! రేపుదయమున నీకెన్నిపనులున్నను దప్పకరమ్ము నీ కుపదేశము చేసెదను. మాకీస్థలవాసవ్రతంబు సమాప్తమైనదని చెప్పెను. ఇట్టిసమయమున నెవరికిఁదెలియకుండ దాఁగియున్న వేమన యీ గురుశిష్యుల సంవాదము విని వెంటనే యాస్థలంబువదలి యభిరామయ్యకన్న ముందుగా మామూలుదుకాణము చేరెను. పిమ్మటఁ గొంచెమాలస్యముగా నభిరామయ్య వచ్చినందున యథాప్రకారముగా వేమనకోపగించెను" తరువాత లంబికాశివయోగి యుపదేశము పొందవలెనని వేమన దురుద్దేశముతోఁ దనవదినయగు నరసమాంబయొద్దకేగి నమస్కరించి తల్లీ ! నామనవి యొకటి గలదు; నెరవేర్తువుగదా ? యనెను; అదేమని యామె యడి

గెను. రేపుదయ మారుగంటలకుముందే యభిరామయ్య దుకాణములోనికి వచ్చి పనిచేయునట్లు మాయన్నగారితో విన్నవించి యాజ్ఞనిప్పింపుమనెను. ఎందులకో, యావిషయము చెప్పుమని యామెకోరఁగా ఫలప్రాప్తి యగుమీఁదట సర్వవిషయమును జెప్పెదను, ముందుగా నాపని నెరవేర్తునని వాగ్దానం బొసంగుమని వేఁడుకొనఁగా నామె సమ్మతించి వేమనను సమాధానపఱచి పంపెను.

పిమ్మటఁ బ్రభువగు తనభర్త భోజనమాచరించి యంతఃపురంబున విశ్రమించి తాంబూలము వేసికొనుచుండఁగా నరసాంబారాణి భయనయ వినయాన్వితయై భక్తిపెంపున భర్తను జేరి బంగారు జుముకాయొకటి కనుపఱచి దీనిజత పోయినది, దీనిమాదిరి క్రొత్త జుముకా రేపు రెండు జాములలోఁగా సిద్ధముచేసి దేవిడీకి పంపునట్లు అభిరామయ్యకు నాజ్ఞయిండని కోరెను. ప్రభువు నప్పుడే యభిరామయ్యను బిలిపించి రేపుదయ మారుగంటలకు మున్నే దుకాణమునకు వచ్చి యీ జుముకా తయారుచేసి పదిగంటలలోఁగా మాకీయవలెనని కఠినమైన యుత్తరువిచ్చెను.

సీ॥ తెల్లవారకముందు తిన్నగా వారింటి
చెంతదాగితిఁ జింతచెట్టుమీఁద
సరగున నతఁడేగి స్నానసంధ్యలు తీర్చి
కుసుమాళి చేకొని గుహనుజొచ్చి
యందున్న యోగికి వందనంబులు చేసి
ముందున్న రామయ్య మోముచూచి
మంత్రోపదేశము మరునాఁడు చేయంగ
వేగరమ్మని శిష్యుయోగి పలుక
తే॥ వింటి నంత యతని వెనువెంట దాఁగి
వదినఁ బ్రార్థించి మాయన్నయనుపుచేత
నాపి రామయ్య, శివయోగిదాపుఁ జేర
నాఫలం బేను గననయ్యె నపుడు వేమ!

అంతట నభిరామయ్య యాజుముకాగొని దుకాణమునకు నడచుచు 'కట్టా యెన్నిదినములనుండియో గురుశుశ్రూషఁ జేసినందులకుఁ దత్ఫలము నేఁటికిలభించె ననుకొంటిఁగాని దాని కీవిధముగా భంగము వాటిలునని కలనైనఁ దలఁపనైతి నని విశేషపరితాపముతో దుకాణము చేరి తమ్మునిముందు జుముకాపడవేసి రేపుపదిగంటలకే బనిఁజేయవలెనని చెప్పి యింటికిఁజని రేపు గురువునాజ్ఞప్రకార మక్కడికేగుదునా? ప్రభువునాజ్ఞప్రకారము దుకాణమున కేగుదునా? యనుచింతతోఁ గూడుకొని దోధూయమానమానసుండై గదిలోఁ బరుండెను. సాధ్వీమతల్లియగు నభిరామయ్యభార్య లక్ష్మీదేవమ్మ యనునామె ప్రతిదినమును సరస్వతీపూజయొనర్చుచుండును. నాఁడు లక్ష్మీదేవమ్మ సరస్వతీపూజ యథావిధినొనర్చి పదిసంవత్సరములయీడుగల తనకుమారితను బిలిచి "అమ్మా! మీనాయనగారు గదిలోశయనించియున్నారు, నీవటకేగి వారినిలేపి మీకృషి వ్యర్థము, పేరుమాత్రముండు నని చెప్పి స్నానమునకు లెమ్మని చెప్పుమనియెను. అట్లే యాబాల చెప్పిన నభిరామయ్య స్నానమాచరించి మడిగట్టుకొని భోజనమునకుముందు శివధ్యానముచేయుచుండఁగా లక్ష్మీదేవమ్మ వడ్డనంతయుఁ జేసి నేతిగిన్నె చేతఁబట్టుకొని మీరుచేయుచున్నశుశ్రూషకు ఫలముదక్కదు, పేరుమాత్రము చిరస్థాయియై ప్రపంచ ముండునంతవరకు నుండుననెను.

చ॥ ధరనతికీర్తిమంతుఁడును దైవసముం డతిగోప్యుఁ డోర్పు మీ
ఱ రహిని గొండవీటియభిరామయ నాగురువర్యుఁ డాతఁడుర్
మఱియుఁ బ్రభుండవీవు ననుమానములే దిఁక మీదునామముల్
స్థిరముగనుండుఁగాక యిదిసిద్ధముసుమ్ము జగాన వేమనా!

అంతట నభిరామయ్య భోజనము చేసి 'అన్యథా చింతితం కార్యం దైవ మన్యత్ర చింతయేత్' అనియు 'జీవన్ భద్రాణి పశ్యతి' యనియు నేమేమోదలఁచియు భార్యహితంబుఁ బాటించియు మనంబు స్వస్థపఱచుకొని మరునాఁ డుదయమున నారుగంటలకే దుకాణమున కరిగి జుముకాచేసి నరసాంబారాణికి సమర్పించుకొనెను.

ఇట్టి యవకాశమున వేమన తెల్లవారుజామున లేచి నిత్యకృత్యంబుల నెఱవేర్చుకొని యభిరామయ్య వలెనే స్నానాదులఁజేసికొని పువ్వులు చెంబునిండ నింపుకొని, గిరిగహ్వరమందుఁ దపోనిష్ఠనున్న లంబికాశివయోగిముందు నిలిచి నమస్కరింపఁగా యోగి క్రొత్తవానింజూచి యెవ్వఁడవురా? నీ వనెను. చిత్తము స్వామీ! నే నభిరామయ్య శిష్యుఁడను, వారికి రాజు స్వకార్యము నియమింపఁగా నాపని నెరవేర్పఁగలందులకు నేగుచుఁ బ్రత్యహకృత్యంబగుటఁ బువ్వులఁ దమకర్పించిరమ్మని నన్నంపిరి. అందున నేనీ పూవులంగొని స్వామికి సమర్పింపవచ్చితిననెను. పిమ్మట నభిరామయ్య వచ్చుచున్నాఁడేమో? చూడరాయని తపసి రెండుమూఁడుమారు లనఁగాఁ గపటియగు వేమన యభిరామయ్యకై నిరీక్షించువానివలె నటునిటు దిక్కులఁబరికించుట నటించి రాలేదని చెప్పె. అంతట యోగి వాఁడు నిర్భాగ్యుఁడు నీవు రారా? యని దగ్గరకుఁబిలిచి చెవులో నుపదేశించి నాలుకమీద బీజాక్షరములు వ్రాసి పొమ్మనెను.

ఇట్లు లంబికాశివయోగి యుపదేశమొందిన వేమనకు, సర్వశాస్త్రములు సకలవేదములు వేదాంత రహస్యములు కరతలామలకము లయ్యెను.

యోగీశ్వరుని వీడినవెంటనే వేమన దుకాణమందు జుముకా చేయుచున్న యభిరామయ్యను జేరి ముందున్న పనిముట్లను బ్రక్కలకు సర్ది వేసి తన్నుఁజూచి గౌరవార్థమై నిలిచియున్న యభిరామయ్య పాదపద్మములకు సాష్టాంగ నమస్కారము లొనర్చి

తే॥ పరమగురుఁ డభిరామయ పాదములకుఁ
జేతులనుజాచి మ్రొక్కితి శిరముఁ జేర్చి;
తప్పు వినియును క్షమియించె నొప్పిదముగఁ
దలఁపఁ డేనందఁ దనపాటిఫలము వేమ.

పాదములను గట్టిగాఁబట్టుకొని కదలనీయక మిమ్ముల మోసపుచ్చి మీదాసుఁడనైతిని, నాతప్పు క్షమియించు నంతవరకు మీపాద

ములవిడువ నని ప్రార్థింపసాగెను. అప్పు డభిరామయ్య యాశ్చర్యపడి మీరు రాజులు, నేను మీభృత్యుఁడను మిమ్మేమి నేను క్షమించుటే మని పరిపరివిధంబుల నాపాదములు విడువుఁడు విడువుఁడని భయసంభ్రమంబుల వేఁడుకొనసాగెను. కాని వేమన క్షమించితి ననువరకు మీ పాదముల విడువను ముమ్మాటికిని విడువ ననెను. అప్పు డచ్చటనున్న రాజబంధువులు భవిష్యద్విషయాంశము కనుగొందము ముందు క్షమించితి ననుమని యభిరామయ్యతో ననిరి. అందుల కాయన కొంచెము సందేహించి యట్లే క్షమించితి ననెను.

క॥ సమయంబు మంచిదయ్యెను
క్షమియించితిరయ్య, నాకు సాధ్యంబాయెన్
దమఫల మటంచుఁ జెప్పితిఁ
గ్రమముగఁ గథయెల్ల ముప్పుఁగడచెను వేమా.

అని తాఁజేసినకార్యం బాద్యంతమును సవిస్తరముగా విన్నవించెను.

సీ॥ మీకుమాఱుఁగ బోవఁ జేకొని పుష్పముల్
గుహలోననున్నట్టి గురుని గాంచి
యయ్య! వచ్చితి నని చయ్యనఁ బూలిచ్చి
సాష్టాంగపడఁగ నాసద్గురుండు
నామోముఁజూచుచు నేమివచ్చితి వన
నభిరామశిష్యుండ నంపి రంటి
అంతటఁ దలయూఁచి యహహా యనుచు వారు
కానిమ్ము రమ్మని కరుణతోడ
తే॥ చేసె నుపదేశ మయ్యది చెందె నాకు
సూక్ష్మకాలంబులో సిద్ధిసూరినైతి
గురువు వదినయెకాక నాగురుఁడ వీవు
నాత్మగురుఁడయ్యె శివయోగి యంటి వేమ!

తరువాత యావద్వృత్తాంతము విని వేమనతో నభిరామయ్య యిట్లనెను.

క॥ శివకవులకు నవకవులకు శివభక్తికిఁ దత్వమునకుఁ జింతామణికిన్
శివలోకప్రమథులకున్ శివునకు గురువునకు శరణుసేయర వేమా!

అంతట వేమన తన్నామస్మరణముతోఁబాటు మీనామస్మరణమును జగంబున వ్యాపించునట్లు పరిపూర్ణజ్ఞానానందసముపేతంబు లగు పద్యంబులు రచించెదనని విశ్వదాభిరామ వినురవేమ! యను మకుట మేర్పఱచి విరచించుచుండెను.

తే॥ చింతవలదయ్య గురు వల మంతనమున
నంకితంబుగ నామంబు నమరఁజేసి
నాదుభక్తిని మీయందుఁ బాదుకొల్పి
చెప్పసాగితిఁ బద్యముల్ క్షితిని వేమ!

ఆ॥ వేయువిధము లమర వేమనపద్యంబు
లర్థమిచ్చు వాని నరసినంత
చూడఁజూడఁగలుగుఁ జోద్యమౌ జ్ఞానంబు
విశ్వదాభిరామ వినురవేమ!

నాఁటినుండి మనవేమన యోగీంద్రుని పామరులును దీర్ఘదృష్టిలేనివారును బిచ్చివేమన యనుచుండిరి.

ఇట్లుండఁగా నతని తల్లి యీవేమన నెట్లేని సంసారభారము వహింపఁజేయవలెనని ప్రయత్నించి కాశికివెళ్లి విశ్వేశ్వరుని సేవించి వత్తము రమ్మనెను. అందులకు వేమన అమ్మా! కాశికిఁబోయిన ఫలమే మనెను. విశ్వేశ్వరుని సేవించుటయే ఫలమని యామె చెప్పఁగా నామె మెడయం దొకరాగిడబ్బుకట్టి కాశికిఁ బంపెను. తరువాతఁదల్లి తిరిగి వచ్చిన, రాగిడబ్బును జూచి తల్లీ! రాగిడబ్బు రాగిడబ్బుగానే యున్న దే కాశికిఁబోయినఫలమే మని మరలననెను. ఓరీవెఱ్ఱివేమనా! కాశికిఁబోయిన రాగిడబ్బు బంగారు కాఁగలదా? యనెను. ఇదిగో నే నారాగిడబ్బును బంగారుడబ్బుగాఁ జేసెదను జూడుమని యాడబ్బునుదీసికొని దాని పైలఘుశంక చేసెను. వెంటనే రాగి బంగారుగా మారెను. అంద రాశ్చర్యమొందిరి.

మఱియొకనాఁడు వేమనయోగి రెండుముసలియెద్దుల నరకకట్టి యొకపొలమునుదున్ని యందులో వెఱ్ఱిపుచ్చవిత్తులు చల్లెను. ఆపైరు చూచి ప్రజలెల్లరును వెఱ్ఱివేమన వెఱ్ఱిపుచ్చకాయలు పండించుచుండె నని హేళనచేయుచుండిరి. పక్వమునకువచ్చిన పుచ్చకాయల నేరించుటకుఁగాను వేమనయోగి కూలివాండ్రను బిలిచెను. కూలివాండ్రు పగలెల్ల కాయలేరి సాయంత్రము కూలి యియ్యవలసినదని యడిగిరి. అప్పుడు వేమన వారేరిన వెఱ్ఱిపుచ్చకాయలు మనిషి కొక్కొక్కటి వంతున నిచ్చెను. అందులకుఁ గూలివాండ్రు మే మివి యేమిచేసికొనెద మనినవ్వి యక్కడనే పారవైచిపోయిరి. కాని యొకముసలమ్మ తీసికొనిపోయి పగులఁగొట్టఁగా నందలివిత్తనములు రత్నములైనవఁట.

ఈ యోగీంద్రునిగురించి కట్టుకత లిట్టివనేకములు గలవు. కథాబాహుళ్యభీతిచే వానినన్నిటిని విడనాడితిని.

తరువాత వేమనయోగీంద్రుని మహత్వంబు ప్రపంచమంతటను వ్యాపించెను. పెక్కురు శిష్యులు చేరుచుండిరి. కడకు సత్యజ్ఞానానందమయుఁడగు పరబ్రహ్మస్వరూపుఁడై 'తత్త్వమసి' యను శ్రుత్యర్థమును లక్ష్యార్థముగా ననుసరించి వేమనానందస్వాములవా రనుపేర విలసిల్లి యెల్లెడల హరునివలెఁ బ్రకాశించెను.

ఆ॥ నందుఁడై నయాతఁ డిందునం దనకుండ
నన్నితావులందు హరునివలెనె
తెలియువారికెల్ల దేవుఁడై కాన్పించు
విశ్వదాభిరామ వినుర వేమ !

ఇట్లు ప్రకాశించుచుఁ గటారుపల్లెలో సిద్ధిపొందెను. శిష్యులు సమాధిఁగట్టించిరి. అచ్చట నిప్పటికిని బ్రతివత్సరోత్సవము జరుగుచున్నది.

ఎఱ్ఱాప్రెగ్గడ.

ఎఱ్ఱాప్రెగ్గడ ప్రోలయ వేమారెడ్డి యాస్థానకవి యని చెప్పియుంటిని. ఈకవీంద్రుఁడు మొట్టమొదట ప్రోలయవేముని తమ్ముఁడగు

మల్ల చమూపతియొద్ద మంత్రిగను నాస్థాన కవిగను నుండెను. మల్ల చమూపతి కురుమలూరు నగరనాయకుఁడుగా నుండెను. ఈమల్ల చమూపతి యెఱ్ఱాప్రెగ్గడకవీంద్రుని దనయన్నగారి కర్పించెను. ఈ కవీంద్రుని యింటిపేరు చెదలవాడవారు. సూరన పోతమాంబిక కుమారుఁడు. శ్రీ వత్సగోత్రజుఁడు. ఆపస్తంబ సూత్రుఁడు. శ్రీమచ్ఛంకర భగవత్పాదాచార్యులవారి శిష్యుఁడు. శంభుదాస ప్రబంధ పరమేశ్వరాది మహాబిరుదాంకితుఁడు. రామాయణ హరివంశముల రచించి ప్రోలయవేమునకు నంకితమిచ్చెను. నరసింహ పురాణము తెనిఁగించి యహోబలస్వామి కంకితము సమర్పించుకొనెను. భారతారణ్య పర్వశేషము నన్నయగారి రచనగానే పూరించెను. నన్నయ తిక్కనలకుఁ దరువాత నాంధ్రకవీంద్రుల కీతఁడు ప్రమాణకవి. కొన్నికొన్ని సందర్భముల నన్నయ తిక్కనాదులకన్న గండఁడని పేర్వెలసిన నాచనసోముఁ డను మహాకవీంద్రుఁ డీసరసకవి శిఖామణికి సమకాలికుఁడు.

శ్రీనాథుఁడు.

శ్రీనాథుఁడు పెదకోమటి వేమభూపాలుని యాస్థానమున విద్యాధికారిగా నుండి కొండవీటి రెడ్డిరాజ్య మస్తమించిన వెనుక రాజమహేంద్రవరమందు రెడ్లయాస్థానమునఁ గవిగానుండెను. ఈతఁడు భారద్వాజగోత్రుఁడు, ఆపస్తంభసూత్రుఁడు, భీమాంబికా మారయల తనూజుఁడు. తనకు సమకాలికులగు కవి పండితగ్రామణులచేతను రాజచూడామణులచేతను మంత్రి శిఖామణులచేతను నగణ్యసన్మానంబులఁగాంచి శాశ్వతమైన యశశ్చంద్రికను నాంధ్రప్రపంచమున వెదఁజల్లెను. ఆంధ్రకవీంద్రులయందు నాచనసోముఁడును గవిత్రయమువారును దక్క నితనితోఁ బోల్పఁదగినవారు లేరు. శ్రీనాథుఁడు సీసపద్యముల సొబగునడకల నడిపించి కవితాప్రచారమునకుఁ గొంత మార్పుగలుగఁ జేసి యాంధ్రవాఙ్మయమున కపూర్వమార్గం బొందు కల్పించినాఁడు. సర్వతోముఖపాండిత్యభూషితుండగు నీకవి పెక్కుకావ్యములు రచించినట్లు తానే చెప్పుకొనెను.

సీ॥ చిన్నారి పొన్నారి చిఱుతకూకటినాఁడు
రచియించితి మరుత్తరాట్చరిత్ర
నూనూఁగుమీసాల నూత్నయౌవనమున
శాలివాహన సప్తశతి నొడివితి
సంతరించితి నిండు జవ్వనంబునయందు
హర్షనైషధకావ్య మాంధ్రభాష
ప్రౌఢనిర్భరవయఃపరిపాకమునఁ గొని
యాడితి భీమనాయకునిమహిమ
తే॥ ప్రాయమింతయు మిగులఁ గైవ్రాలకుండఁ
గాశికాఖండ మనుమహాగ్రంథమేను
దెనుఁగుచేసెదఁ గర్ణాటదేశకటక
పద్మవనహేళి శ్రీనాథభట్టసుకవి.

మనకిప్పు డీకవికృతులలో మరుత్తరాట్చరిత్రయు శాలివాహన సప్తశతియుఁ గనంబడవు. శృంగారనైషధము పెదకోమటి వేమభూపాలునిమంత్రియగు మామిడిసింగనామాత్యునకును హరవిలాస మవచి తిప్పయసెట్టికిని, కాశీఖండము రాజమహేంద్రవరముపాలించిన కాటయ వేమారెడ్డిసంబంధికుఁడగు వీరభద్రారెడ్డికిని, భీమేశ్వరపురాణ మన్న యామాత్యున కంకితమీయఁబడెను. పైపద్యమందుఁ దెలిపినకృతులే గాక శ్రీనాథునికృతులను కింవదంతితో వీధినాటకాదులు కొన్ని కనంబడుచున్నవి. ఇమ్మహాకవివరేణ్యుం డత్యుత్తమప్రౌఢప్రబంధముల రచించిన కవిగండఁడు. కావుననే కవిసార్వభౌమ, సకలవిద్యాసనాథ మొదలగుబిరుదులఁబొందినాఁడు. తనగ్రంథములయం దీకవి విశేషించి శృంగారరస ముపయోగించుటచేతను దత్కృతంబులగు శృంగారభూయిష్టంబులగు స్త్రీవర్ణనాపద్యము లనేకములుకనుపట్టుటచేత నిటీవలి వారు శ్రీనాథుఁడు స్త్రీలనాథుఁడేయందురు. తనకాశ్రయులగు రెడ్డిరాజులును భూసురాగ్రగణ్యులగు నమాత్యశిఖామణులును గీర్తిశేషు

లుకాఁగాఁ దన్నాదరించి సత్కరించువారలులేక కృష్ణాతీరమున బొడ్డుపల్లెను గుత్తకుఁగొని క్రొత్తకృషీవలత్వ మవలంబించిన సస్యంబు కృష్ణానదివరదచే మురిగిపోయెనఁట. ఈ విశేషము లీక్రింది పద్యము చెప్పుచున్నది.

సీ॥ కవిరాజుకంఠంబు కౌఁగిలించెనుగదా
పురవీథి నెదురెండ పొగడదండ
ఆంధ్రనైషధకర్తయంఘ్రియుగ్మంబునఁ
దగిలియుండెనుగదా నిగళయుగము
వీరభద్రారెడ్డివిద్వాంసు ముంజేత
వియ్యమందెనుగదా వెదురుగొడియ
సార్వభౌముని భుజాస్కంధ మెక్కెనుగదా
నగరివాకిటనుండు నల్లగుండు
తే॥ కృష్ణవేణమ్మ గొనిపోయె నింతఫలము
బిలబిలాక్షులు తినిపోయెఁ దిలలు పెసలు
బొడ్డుపల్లెను గొడ్డేరి మోసపోతి
నెట్లుచెల్లింతుఁ డంకంబు లేడునూర్లు.

అవసానకాలమం దీకవిచంద్రుఁడు దరిద్రదశ ననుభవించి యీ క్రిందిపద్యముచెప్పి పరమపదవాసియయ్యెను.

సీ॥ కాశికావిశ్వేశుఁ గలిసె వీరారెడ్డి
రత్నాంబరంబు లేరాయఁడిచ్చు
రంభఁ గూడెఁ దెనుంగురాయరాహుత్తుండు
కస్తూరి కేరాజుఁ బ్రస్తుతింతు
స్వర్గస్థుఁడయ్యె విస్సనమంత్రి మఱిహేమ
పాత్రాన్న మెవ్వనిపంక్తిఁ గలదు
కైలాసగిరిఁ బండె మైలారువిభుఁడేగి
దినవెచ్చ మేరాజు తీర్పఁగలఁడు
తే॥ భాస్కరుఁడు మున్నె దేవునిపాలి కరిగెఁ
గలియుగంబున నింక నుండఁ గష్టమనుచు

దివిజకవివరుగుండియల్ దిగ్గు రనఁగ
నరుగుచున్నాఁడు శ్రీనాథుఁ డమరపురికి.

భక్తశిరోమణియు నాంధ్రమహాభాగవతకృతికర్తయు, సహజ పాండిత్యవిశారదుఁడును నగు బమ్మెరపోతనకవీంద్రుఁ డీకవిసార్వభౌమునకు సమకాలికుఁడు.

చీఁకటి కోనేరు.

రాచవేమనదుష్పరిపాలనమువలనఁ గొండవీటిరాజ్యము విజయనగరరాజుల పరిపాలనయందుఁ జేరినట్లు పెక్కుగాథలవలనను శాసనములవలనను బోధపడుచుండఁగా దీనికిఁ బ్రతికూలముగా బహుకాలమునుండి పరంపరాగతంబైన బహుజనప్రతీతి యీక్రిందివిధముగాఁ గలదు. శత్రురాజదుర్భేద్యంబైన కొండవీటిదుర్గమందు నీరెడ్డిరాజులు నిరంకుశాధికారులై ప్రభుత్వము సాగించుచుండఁగా ఢిల్లీనవాబు వీరినిజయింపవలెనని పెక్కుమారులు దండయాత్రలు సలిపి నిష్ఫలమనోరథుఁడై విసిగి వేసారి స్వపురికరిగి తద్విధ్వంసమునకై యారయుచుండెనఁట. అంతట ధీవిశాలుండైన బ్రాహ్మణుం డొకఁడువచ్చి కొండవీటి కోటనేనుసాధింతునని ప్రతిజ్ఞచేసి కొండవీటిదుర్గముచేరి కొంతకాలమునుండి మిక్కుటవిశ్వాసపరునిమాడ్కి నటించి రాజులకు నమ్మకముగలుగఁ జేసెనఁట. తరువాత నాపట్టణమున రాజునాజ్ఞఁబొంది యొకదేవాలయము గట్టించి గర్భాలయంబునఁ బరులెఱుంగకుండ నేర్పరులగుపనివాండ్రచే వాడికత్తులు సంధింపఁజేసెనఁట.

తదనంతర మొకశిల్పశాస్త్రపారంగతునిచే నిత్యమేడుఘడియలు వేణునాదముచేయు గోపాలస్వామివిగ్రహ మొండు సృష్టింపఁజేసి యాదేవాలయమందు నన్యుల కగోచరంబుగా నావాడికత్తులచే నిర్మింపంబడినూతికిఁబడమటియొడ్డున స్థాపించి శౌర్యపరాక్రమశాలురని ప్రసిద్ధంబుగాఁ బేర్వోలసిన రెడ్డినాయకుల నెల్లరను బ్రథమదినసంబున దేవతాప్రదక్షిణార్థంబై యొక్కొక్కరిని సందర్భానుకూలముగానిర్మింపఁబడిన తూర్పువాకిటనుబోయి దక్షిణద్వారమునఁదిరిగిరమ్మని వేఁడుకొనెనఁట.

అంతట దేవతాసంబంధమగు కార్యమగుటచేతను, బ్రాహ్మణుండు దైవారాధనాపరత్వశేముషీ విశేషుండని నమ్మకముండుటచేతను నే యనుమానములు లేక నిశ్శంకితమానసులై యొక్కొక్కరేగి వేణునాదము చేయుచున్న వేణుగోపాలస్వామివిగ్రహముముందున్న చీఁకటికోనేటియందుఁబడ ప్రాణములు గోల్పోయిరఁట.

చిరకాలమునుండి వాడుకయందున్నయీగాథనుగురించి సత్యాసత్యములు న్యాయైకబుద్ధితో విమర్శింపవలసియున్నది. గావున ముం దీచీఁకటికోనేటిచుట్టు నిర్మింపఁబడిన దేవాలయస్థితిని విచారింతము.

ఈకోవెల కొండవీటియందున్న యన్నియాలయములకన్న మిగులఁ బెద్దది. ముఖమంటపమునందు స్తంభములయందుఁ జేసిన శిల్పకళానైపుణ్యము వర్ణింపశక్యముకాదు. ఒక్కొక్క స్తంభమునందు నాలుగుచివరలేర్పడి నాలుగు దిక్కుల స్తంభములుగా నిర్మింపఁబడినవి. ఈ స్తంభములచివరఁజిత్రింపఁబడిన పీటలయొక్క పనితనము నేత్రానందకరముగానుండును. చూరుగా దింపఁబడిన కప్పురాలస్థితి చూపరులకు మహాశ్చర్యము దోఁపింపక మానదు. వేయేల! యీచీఁకటికోనేటి శిల్పకళాచాకచక్యము చరిత్రాన్వేషుంచిత్తంబులురంజిల్లఁ జేయక మానదు. మఱియు నీకొండవీటిసీమయందు నీయాలయముతోఁ దులతూఁగఁగల యాలయము లేదనిచెప్పుట యతిశయోక్తిగాదు. దీనిని మనవారు కొందరు దేవాలయమనెదరుగాని హిందూదేవాలయములకుండు కట్టడపువిధానము లోకముఖమంటపమునఁ దక్క మఱియెందునను గానరాదు. కాని కోవెలకుముందు నించుమించు పదిగజములపొడవుగల యెనిమిది పలకలుగాఁ జెక్కఁబడిన శిలాధ్వజస్తంభములు మాత్ర మున్నవి. పై గాథవచించినట్లు చీఁకటికోనేరు భాగమునకు దక్షిణముగాఁగాని యుత్తరముగాఁగాని ద్వారములు లేవు ఒక్క తూర్పునందుమాత్రమే గలదు. నేను చీఁకటికోనేరనిచెప్పఁబడుగదికి దగ్గరకుఁబోయి నిప్పుపుల్ల వెలిగించియు రాళ్లురువ్వియుఁజూచితిని. కాని గుంటగాఁగాని పల్లముగాఁగాని యున్నట్లు నాకగపడలేదు. జను లెవ్వరును నాగదిలోనికి మాత్రముపోరు. ప్రస్తుత మాగది మూయగట్టియున్నారు.

ఈవిషయ మట్లుండనిచ్చి యేరెడ్డిరాజు పాలనముచేయునపు డీదుండగ మొనర్పఁబడెనో కనుగొందము.

ప్రోలయవేమారెడ్డి యద్దంకియందుండి రాజ్యపరిపాలనము చేసినాఁడనుట సర్వజనప్రసిద్ధంబు. ఇఁక ననపోతారెడ్డిగదా యీకొండవీటిని నవరాజధానిగ నేర్పరచుకొనినది! ఈయనపోతారెడ్డి తనతండ్రి కద్దంకి రాజధానియైయుండఁగా రాచకొండ, దేవరకొండ రాజ్యాధిపతులచేతను, కర్ణాటాధిపతులచేతను దనపాలన కెంతేని సిలుగు చేకూరునేమో? యనియుఁ బర్వతప్రాంతంబునఁ గోటఁగట్టుకొనిన శత్రువులను సులభముగా జయింపవచ్చుననియు నెంచి నవరాజధాని కల్పించుకొనిన యుపాయశాలి. మఱియు నతనిపరమందుఁగాని పూర్వమందుఁగాని యంతటి యప్రతిమానపరాక్రమవంతుఁడు లేఁడని పేరుపొందిన దిట్ట అత్యంతము దేవబ్రాహ్మణభక్తిఁగలిగి దైవజ్ఞశిరోమణుల కనేకాగ్రహారములిచ్చి యగణ్యంబులగు శాసనములు వ్రాయించిన ధర్మమూర్తి. ఇతనిపరిపాలనాకాలమం దీకార్యము జరిగినదని యనుకొందమన్న వీని యనంతర మనవేమన, కుమారగిరి, కోమటివేమన, రాచవేమన, రాజ్యభారము వహించిరనుట పిష్టపేషణము. కడకీమహావిప్లవము రాచవేమనకాలమందు జరిగెనని యొప్పుకొందమన్నను గ్రంథదృష్టాంతములుగాని చాటుధారలగు శ్లోకపద్యాదులుగాని శాసనములుగాని కనుపడకపోవుటేకాక యీకొండవీటిరాజ్య మస్తమించిన వెనుక శ్రీనాథకవీంద్రాది భూసురాగ్రగణ్యులనేకులు రాచవేమారెడ్డికి ముఖ్యబంధువులును రాజమహేంద్రవరరాజధానిపాలకులును నగు వీరభద్రారెడ్డి మొదలగువారి నాశ్రయించిరనుట జగత్ప్రసిద్ధంబుగదా? తమబంధువుల నన్యాయముగాఁ జంపించిన బ్రాహ్మణశాఖవారిని రాజ్యమునఁ జేరనిచ్చి గౌరవించి కాపాడఁగలరా?

ఈవిషయ మిట్లుండ బ్రాహ్మణునివిషయ మెట్టిదో మొదలే యంతు తెలియదు. బ్రాహ్మణుని బ్రేరేపించినవాఁడగు మహమ్మదీయ ప్రభువు ఢిల్లీనవాబని యీకథ చెప్పుచుండెనుగాని ఢిల్లీ కొండవీటి

రాజ్యములకు మధ్యకటకము, రాచకొండ, దేవరకొండ, రాజమహేంద్రవరము మొదలగు పెక్కుస్వరాజ్యములుండినవిగదా! ఆయారాజుల జయింపకుండ మిన్నువిరిగి పడినట్లు కొండవీటికోట స్వాధీనపరచుకొనవలెనని ఢిల్లీనవా బేల ప్రయత్నించును? ఈనవాబునకుఁగాని కొండవీటి ప్రభువగు రాచవేమనకుఁగాని, కటకము, రాచకొండ, దేవరకొండ, రాజమహేంద్రవరాదిరాజ్యములు లోఁబడియున్నట్లు తెలుప నాధారములు గలవా? లేవు.

కాఁబట్టి యెన్నివిధములఁ బ్రయత్నించినఁ బైగాథ శాసించిన ప్రకారము కొండవీటిరాజ్యము విప్లవమైనదని నమ్ముటకు వీలులేదు. పైయావద్విషయము లట్లుండనిచ్చి కొండవీటిదండకవిలె కయిఫీయతు మొదలగువానియం దీవిషయమిట్లున్నది.

రాచవేమన తండ్రితాతలనాఁటి రాజ్యపరిపాలనా పద్ధతి వదలిపెట్టి ప్రజలపైఁ గ్రొత్తపన్నుల విధించి దుష్ప్రవర్తనముతోడ జరిపించుచుఁ దన భృత్యుఁడగు సౌరము యల్లయ యను బలిజనాయకునిపైఁ బురిటిపన్ను వేసి బలవంతముగా రాఁబట్టుకొనినందున నాతఁ డాగ్రహించి యొకనాఁడు ముత్యాలమ్మ గుడియొద్దఁ గటారితోఁ బొడిచిచంపెననియు రాచవేమన దుష్పరిపాలనవలన బ్రజలే కడతేర్చిరనియు వాదించుచున్నవి. కొందరు దీనికి విరుద్ధముగాఁ బైదండకవిలె బ్రాహ్మణునిచే వ్రాయఁబడినదేమో యనియు నందుచేఁ గులాభిమానముగలిగి యీవిషయము వెల్లడింపకుండి యుండుననియు నొకదోష మారోపణ చేయుచున్నారు. కాని యెన్నియో సంవత్సరములనుండి విశ్వబ్రాహ్మణు లనుభవించుచున్న కరణీకముల నన్యాయముగా నొకక్షణములోఁ దీయించిన గోపరాజు రామనప్రధాని యావద్వృత్తాంతము నిరాఘాటముగా వచించినదండకవిలె నిజముగా నీవిప్లవ మీవిధముగా జరిగియుండినయెడల నించుకైనను నుడువకుండునా?

కాఁబట్టి యీరెడ్డిరాజుల రాజ్యసంపాదనఁ గూర్చియుఁ బద్మనాయకుల యైశ్వర్యమునుగురించియుఁ గట్టుకథ లెట్లు కల్పింపఁబడినవో

యట్లే యీగాథగూడఁ గల్పితమని నేనూహింతును. పక్షద్వయంబును న్యాయాదర్శకులగు విమర్శకులు విమర్శింతురుగాత.

కర్నాటరాజుల పరిపాలనము.

కర్నాటరాజ్యమునకు నారవరాజగు ప్రౌఢదేవరాయ లీకొండవీటి రెడ్డిరాజులలోఁ గడపటివాఁడగు రాచవేమనయొద్దనుండి 1425 సం॥ గ్రహించి 1446 సం॥ వరకుఁ బాలించెను. తరువాత నాతనికుమారుఁడు మల్లికార్జునరాయలు రాజ్యాధిపతియయ్యెను. ఇతఁడు మహాపరాక్రమశాలి. వీనిపరిపాలనాకాలమందుఁ గటకపురి రాజధానిగాఁగల కళింగదేశ మేలుచున్న కపిలేంద్రగజపతి విజయనగరముపై దండెత్తివచ్చెను కాని యసామాన్య సాహసాధారుండైన మల్లికార్జునరాయలు గజపతితో ఘోరయుద్ధముచేసి తరిమివేసెను. మల్లికార్జునరాయల తరువాత నతని సవతితల్లికుమారుఁడగు విరూపాక్షరాయలు రాజయ్యెను. ఇతఁడు సురాపానమత్తుఁడై స్త్రీలంపటుండై ప్రవర్తించుటంజేసి పైకళింగాధిపతి కపిలేంద్రగజపతి 1447 సం॥ తన రాజధానిలోఁ జేర్చుకొని మన కథాభాగమగు కొండవీటి దుర్గమున గణదేవుఁడనువానిఁ బాలనాధికారిగా నియమించెను. ఈ కొండవీటి దుర్గమందుండి గణదేవుఁడు 1447 సం॥ మొదలు 1461 సం॥ వరకుఁ బాలించెను. తరువాత 1461 సం॥ మొదలు 1496 సం॥ వరకు వీరపురుషోత్తమగజపతి గజపతిరాజ ప్రతినిధిగాఁ గొండవీటిదుర్గము పాలించెను. వీరరుద్రగజపతి కళింగరాజ్యాధిపతిగా నున్నప్పు డితని కుమారుఁడు వీరభద్రగజపతి 1496 సం॥ మొదలు 1515 సం॥ వరకుఁ గొండవీటి దుర్గమునందు వసించి రాజ్యపాలన చేయుచుండెను. అప్పుడితని కుదయగిరి, అద్దంకి, వినుకొండ, బెల్లంకొండ, తంగేడ, కేతవరము మొదలగు కృష్ణానదికి దక్షిణముననున్న ప్రసిద్ధంబులగు దుర్గంబులన్నియు లోఁబడియున్నవి. ఈదుర్గములన్నిటికి, ముఖ్యస్థానము కొండవీటి దుర్గము. వీనియొద్ద గసవాపాత్రుఁడు, బలభద్రపాత్రుఁడు, భీకరపాత్రుఁడు మొదలగు శత్రుభయంకరులగు సేనానులుండిరి, ఇట్టిసమయమునఁ గర్నాటరాజ్యమునకు ముఖ్యస్థానమగు విజయనగరమందు మహారాజ రాజాధిరాజ రాజపరమేశ్వరాది బిరుదాంకితుండైన కృష్ణదేవరాయ లేలుచుండెను.

విజయనగరము

కృష్ణదేవరాయల పరిపాలనము.

విజయనగరము ఆకాలమున నాంధ్రదేశమునందున్నట్టి పట్టణములలో మహాప్రసిద్ధికెక్కినది. శిల్పకళానైపుణి వెల్లడించు చిత్రంబులగు దేవాలయములు సభామందిరములు మిద్దెలు మేడలు రాజసౌధములు అశ్వశాలలు ఏనుఁగుమిట్టలు మొదలగుచమత్కారములగు శిలానిర్మాణములిప్పటికి శిథిలమైకనంబడుచున్నవి. శిథిలప్రదేశంబుఁగాంచిన యెడల నాకాలమున నాపట్టణ మెంతమహోన్నతదశనున్నదియు నెట్టిబలమైనదుర్గమైనదియు నెఱుఁగవచ్చును. ఈపట్టణమును గాకతీయ సామ్రాజ్యాధిపతియైన రెండవప్రతాపరుద్రునియొద్దఁ గోశాధికారిపదవులందు హరిహరరాయలు బుక్కరాయ లనునిరువురుసోదరులుండి యాయాంధ్రసామ్రాజ్య మస్తమించినవెనుక నేఁటి బళ్ళారిమండలములోని రామాయణకాలమునాఁటి కిష్కింధాపట్టణస్థానమైన యానెగొంది రాజ్యమేలుచున్న జంబుకేశ్వరరాయలకడకేగి తమపూర్వ శౌర్యధైర్యసాహసములం బ్రకటించి మంత్రిపదవియందు హరిహరరాయలును, గోశాధికారి పదవియందు బుక్కరాయలును నుండిరి. తరువాత ఢిల్లీచక్రవర్తి జంబుకేశ్వరుని రణరంగమున సంహరించి యతనిమంత్రియగు హరిహరరాయలకుఁ బట్టముఁగట్టి ఢిల్లీ చేరెను. ఈ హరిహరరాయల యొద్ద నతనితమ్ముఁడు బుక్కరాయలు మంత్రిగానుండెను. ఈ సోదరులిరువురు నొకనాఁడు మృగయావినోదార్థమై సైన్యముతో బయలుదేఱి తుంగభద్రానదిని దాటి యానదికి దక్షిణముగానున్న యరణ్యమునఁ జరించుచుండఁగా నొకకుందేలొకవేటకుక్కను దరిమి పైఁబడి కరచెనఁట. హరిహరబుక్కరాయ లీవిచిత్రములుగాంచి యాశ్చర్య

మగ్నులై విరూపాక్షుని దేవాలయమొద్దనున్న విద్యారణ్యస్వాములవారి కడ కేగి విచిత్రమగు పై విషయము విన్నవించుకొనిరఁట. అంత నా మహాత్ముం డాప్రదేశంబు జయప్రదమైనదనియు మీర లచ్చోట నొక పట్టణము నిర్మించినచోఁ బరరాజుల కజేయమై భాగ్యభోగ్యముల కాలవాలమై బహువర్షములు వర్ధిల్లునని సెలవీయ నాసోదరద్వయం బా జగద్గురునియాజ్ఞ శిరసావహించి శుభముహూర్తంబున శంకుస్థాపనఁ గావించి నగరనిర్మాణంబుఁ జేసి విద్యారణ్యునిహితోపదేశ మనుసరించి కట్టఁబడినదిగాన విద్యానగరమని తత్పట్టణంబునకు నామకరణం బొనర్చిరి. అది మొద లీపట్టణమేలురాజులకు విశేషించివిజయమే సేకూరుచున్నందున విజయనగరమను పర్యాయనామంబున విలసిల్లుచుండె.

మనకథాకాలమున నీవిజయనగరసామ్రాజ్యమును సుప్రసిద్ధాంధ్రచక్రవర్తియగు కృష్ణదేవరాయ లేలుచుఁ గళింగరాజ్యాధిపతియగు వీరరుద్రగజపతిని జయింపవలెనని దాడివెడలి ముందు కొండవీటిసీమను స్వాధీనపరచుకొనవలెనని ముట్టడించెను. అప్పు డీకొండవీటి దుర్గమునకుఁ బైవీరరుద్రగజపతి కుమారుఁడు వీరభద్రగజపతి పాలనాధికారిగా నుండెనని చెప్పఁబడెను.

కృష్ణదేవరాయ లీకొండవీటిదుర్గమును ముట్టడించినాఁడని విన్నంతనే కటకమునుండి వీరరుద్రగజపతి యనేకసేనలతో బయలుదేరి కృష్ణదేవరాయల నెదురించి ఘోరముగా యుద్ధముసలిపెఁగాని నిశ్చలపరాక్రమాతిశయుండగు కృష్ణదేవరాయలు వీరరుద్రగజపతి నోడించి 1515 సం॥ మున నీకొండవీటిదుర్గమును జయించి కర్నాటరాజ్యములోఁ గలుపుకొనినాఁడు. ఈకృష్ణదేవరాయలు మహాపరాక్రమశాలి. విజయనగరసామ్రాజ్యపీఠ మెక్కినతోడనే విశేషముగా దండయాత్రలుసలిపి సమస్తదిక్కులేలు రాజులనెల్లరను జయించి దిగ్విజయంబుచాటెను. హరిహరబుక్కరాయలతొలిరాజులలో నీకర్నాటసామ్రాజ్య మంత విస్తీర్ణతఁ జెందియుండలేదు. మఱియు సంతటిప్రశస్తియుఁ గలిగియుండలేదు. ఈనృపాగ్రగణ్యుఁడు వైరివీరులతోఁ బదేపదే పవరములొనర్చి

బహుతరముగా జయలక్ష్మినివరించియుండుటచే మహారాజాధిరాజరాజపరమేశ్వరాదిబిరుదులఁబొందెను. ఇతనిపరిపాలనాసమయమం దాంధ్రరాష్ట్ర మత్యైశ్వర్యప్రాభవంబుల రాజిలుచుండెను. పంటచెరువులు పంటబావులు విచ్చలవిడిగాఁద్రవ్వించెను. రాజమార్గములు రహదారీలు పెక్కులుకల్పించెను. పోర్చుగీసువారితో వర్తకసంబంధమున స్నేహముఁజేసి తనరాజ్యమున వ్యాపారముఁబెంపెసలార్చెను. పరిపాలనావిధాన మత్యంతప్రశస్తమైనదిగాన రాష్ట్రప్రజలెల్లరును చిరసౌఖ్యము లనుభవించుచుండిరి. ఇతఁడు పరాక్రమంబునఁ జండప్రచండుఁడగుటేగాక రసికుఁడై పండితుఁడై పండితులను గవులను సదాపోషించి యాంధ్రభోజుఁడను బిరుదుపొందెను. తాను స్వయముగా నాంధ్రమునం దాముక్తమాల్యదయు సంస్కృతమున మదాలసచరిత్రయు రచించెను. ఈమహారాజు నాస్థానంబున నష్టదిగ్గజము లనం బరగి సుప్రసిద్ధులగు పెద్దన, తిమ్మన, సూరన, రుద్రయ, భట్టుమూర్తి, రామలింగయ, రామభద్రయ యను శ్రీమదాంధ్రకవిచంద్రులుసప్తస్థానంబులం దుండఁగాఁ దా నష్టమస్థానమలంకరించునఁట. ఈకృష్ణదేవరాయలయొద్దఁ బ్రశస్తపరాక్రమశాలియు రాజభక్తిపరాయణుఁడును వివిధవిద్యానిపుణుఁడును ధనుర్వేదసాహిత్యజ్ఞానంబునఁ గలియుగద్రోణుం డనఁనొప్పు తిమ్మరుసు అనునియోగిబ్రాహ్మణప్రవరుండు ప్రధానమంత్రిపదవియందుండెను. ఈ యమాత్యశేఖరుండే తనతమ్ముఁడగు గోవిందరాజుచేతఁ గృష్ణరాయనికి శైశవమున సంస్కృతాంధ్రభాషాసాహిత్యంబును ధనుర్వేదపారంగత్వమును గలవరచెను. అందువలన నీతిమ్మరుసుమంత్రియందుఁ గృష్ణదేవరాయలకు గురుభక్తియుఁ బితృభక్తియుఁ బెనంగొని యుండెను. తిమ్మరుసుప్రధానశేఖరుఁడైన కారణముననే విజయనగరమునకు విజయమును, కర్నాటరాజ్యమునకుఁ గీర్తియుఁ గలిగెనని కొందఱు పెద్దలు చెప్పుదురు.

అల్లసానిపెద్దన.

అల్లసానిపెద్దన బ్రాహ్మణ వంశజుఁడు. ఇతఁడు కృష్ణదేవరాయల యాస్థానకవి యని చెప్పియుంటిమి. ఈ కవివర్యుండు స్వారోచిష మనుసంభవ మనునభిధేయముగల మనుచరిత్ర రచించి కృష్ణదేవరాయల కంకితముచేసెను. ఇతని కవితామాధుర్యముఁ జవిగొనని యాంధ్రపండితుఁడు లేఁడు. పండితులేగాక పామరులు సైత మీయనపేరు వినియుందురు. కృష్ణదేవరాయల యాస్థానమందున్న కవులెల్లరిలో నితనికి గౌరవమెక్కువ. మనుచరిత్ర మంకితమందినప్పుడు రాయలీకవిచంద్రుని బల్లకియందుంచి తనకుఁగలభక్తి ప్రకటించుటకై యందలము స్వహస్తంబున నెత్తినాఁడు. మఱియొకనాఁడు పసిడిపళ్లెరమునఁ గవిగండపెండేరమును సభాస్థానంబునకుఁ గొనివచ్చి యాంధ్రగీర్వాణములయందు సమముగాఁ గవిత్వముఁ జెప్పఁగలవారిద్దానిఁ గైకొనుఁడని సప్తకవులను హెచ్చరింపఁగాఁ గవులెల్లరు మిన్నకుండిరఁట. అంతటఁ గృష్ణదేవరాయ లీక్రిందిసగపద్యముః చదివెనఁట.

ఉ॥ 'ముద్దుగ గండపెండియరముఙ్గొనుఁడంచు బహూకరింపఁగా
నొద్దిక నాకొసంగుమని యొక్కరుఁగోరఁగలేరు లేరొకో!'
అంతటఁ బెద్దనకవీంద్రుఁడు లేచి,
పెద్దనఁబోలుపండితులు పృథ్విని లేరని నీవెఱుంగవే
పెద్దన కీదలంచినను బేరిమి నాకిడు కృష్ణరాణ్ణృపా!

అనిపూరించి వెంటనే ముప్పదిచరణములుగల యుత్పలమాలికా వృత్తమును సగమాంధ్రముతో సగము సంస్కృతముతో నాశువుగా విరచించెను. రాయలంతట హర్షోత్కర్షంబునఁ గవిగండపెండేరమును దానే పెద్దనపాదమునకుఁ దొడిగెను. ఇక్కవికులోత్తముండు రాయల నిర్యాణానంతరము సైతము బ్రతికియుండి సీసశతక మొండు రచించెననియు నీక్రిందిపద్య మాసీసశతకములోనిదిగాఁ జెప్పెదరు.

సీ॥ ఎదురైనచోఁ దనమదకరీంద్రము నిల్పి
కేలూతయొసఁగి యెక్కించుకొనియె

కోకటగ్రామాద్యనేకాగ్రహారము
లడిగిన సీమలయందు నిచ్చె
మనుచరిత్రం బందుకొనువేళఁ బురమేఁగఁ
బల్లకిఁ దనకేలఁ బట్టియెత్తె
బిరుదైన కవిగండపెండేరమున కీవ
తగుదని తానె పాదమునఁ దొడిగ

తే॥ ఆంధ్రకవితాపితామహా! అల్లసాని
పెద్దనకవీంద్ర! యని నన్నుఁ బిలుచునట్టి
కృష్ణరాయలతో దివి కేగలేక
బ్రతికియున్నాఁడ జీవచ్ఛవంబ నగుచు.

రాయలయనంతర మీతఁ డెంతవరకుండెనో తెలిసికొనుటకేయాధారములు లేవని చరిత్రజ్ఞులు నుడువుచున్నారు.

నందితిమ్మన.

ఈయన దొడ్డకవి. ఈయనయే ముక్కుతిమ్మనయనియు నందితిమ్మనయనియు నందిసింగనయనియు గ్రంథంబులయందుఁ బేర్కొనంబడెను. ఈతని కవిత్వంబు విరుపుపోరుపులేక దిద్దితీర్పఁబడి ముద్దులు గురియు జిలిబిలి పలుకులుగలిగి తేనెలుట్టిపడుచుండును. పారిజాతాపహరణము రచించి రాయలకంకితముఁ జేసి రత్నకుండలాది బహుమానము లందుటయేగాక 'ముక్కుతిమ్మనార్యు ముద్దుపలుకు,' అనెడి పొగడ్తఁ గాంచెను. ఈ కవివరునకు ముక్కు పొడుగుగా నుండుటచేతనని కొందరును, ఇతఁడు చెప్పిన ముక్కుపద్యము మనోహరముగా నుండుటవలననని కొందరును, ఇతనిని ముక్కుతిమ్మన యనుటకుఁ గారణము చెప్పుచున్నారు. ఆముక్కుపద్య మిదియఁట!

శా॥ నానాసూనవితాన వాసనల నానందించు సారంగ మే
లా నన్నొల్లదటంచు గంధఫలి బల్కాకం దపంబాది యో
షా నాసాకృతిఁ దాల్చి సర్వసుమనస్సౌరభ్యసంవాసియై
పూనెం బ్రేక్షణ మాలికామధుకరీ పుంజంబు లిర్వంకలన్.

ఈపద్య మీకవివరుండు రచింపఁగా భట్టుమూర్తి పరమానంద భరితుఁడై నాలుగువందల వరహాలకుఁగొని తనవసుచరిత్రము నందఁ బొందుపఱచెనఁట. శ్లేషకవిత్వమునం దత్యంత ప్రసిద్ధివహించి సర్వవిధంబులఁ బైపద్యంబుకన్న రసవత్తమములగు పద్యంబులుగల వసుచరిత్ర రచించిన రామరాజ భూషణుం డీపద్యముఁగొని వసుచరిత్రమునం దుంచెననెడి మాట నిరాదరణీయంబని కొంద రభిప్రాయపడుచున్నారు. కాని తిమ్మనకవిశిరోమణియందు భట్టుమూర్తికి నయభయ వినయాన్వితమైన గురుభక్తి పెనంగొని యుండునఁట. ఒక సమయమునం దీతిమ్మకవి పారిజాతాపహరణమునకుఁ గృతిపతిత్వమందు కొనునపుడు రాయల వలనఁ దాబహూకృతిగాఁ బొందిన రత్నకుండలముల ధరించి తన యింటిముం దరుగుపైఁ గూర్చుండియుండఁగా భట్టుకవివరుం డామార్గమునఁ జనుచు నీపద్యముఁ జెప్పెనఁట.

కం॥ మాకొలఁది జానపదుల కె నీకవనపుఠీవి యబ్బునే? కూపనట
ద్భేకములకు గగనధునీ శీకరములచెమ్మ? నంది సింగయతిమ్మా!

ఈపద్యమున కానందించి తిమ్మకవి తత్కాలంబునఁ దనచేత నేమియు లేకుంటం జేసి కర్ణమునుండి రత్నకుండలమొకటి తీసి భట్టుమూర్తి కొసంగెనఁట. తరువాత రాయల సన్నిధానమునకు నొంటికుండలములతోఁ దిమ్మభట్టుమూర్తికవు లిద్దరేగిన నావరకు మున్నె యీవిషయమెఱిఁగిన రాయలు భట్టుమూర్తి కృతంబగు పైపద్యమున "గగనధునీ" యనుచోట 'నాకధునీ' యనిదిద్ది పద్యమునకు మెఱుఁగిడెనఁట. రాయల కుశాగ్రబుద్ధికి మెచ్చుకొని కవులిద్దఱు రెండు కుండలములను సమర్పించుకొనఁగా రాజు వీరి సరసతకు మెచ్చి బహుబహుమానములిచ్చి పంపెనఁట

పింగళిసూరన.

కవితారచనయం దీతఁ డసాధారణ ప్రజ్ఞగలవాఁడు. తిక్కన సోమయాజికిఁ దరువాతఁ బరులరచనావిధానముల నూతఁ గొనక యాంధ్రకావ్యములు వ్రాసినవారిలో నితనిని జేమకూర వెంకటకవిని

ముఖ్యులుగాఁ బెద్దలు నిశ్చయించినారు. ఈమాట విన్నంతనే నాచన సోముఁడు శ్రీనాథుఁడు మున్నగు పండితులు జ్ఞప్తికి రాకపోరని మరి కొందరు పెద్ద లనకమానరు. ఇతఁడు రామాయణభారతకథలజోడించి రాఘవపాండవీయమనుద్వ్యర్థి కావ్య మతిప్రశస్తతరముగా రచించెను. మఱియుఁ గళాపూర్ణోదయము ప్రభావతీప్రద్యుమ్నమును నితని కృతులుగా నాంధ్రలోకమున వ్యాపించియున్నవి. ఈచతురకవి కృష్ణదేవరాయలయాస్థానకవులలోనివాఁ డనుకింవదంతింబట్టి దిక్ప్రదర్శన మొనర్పవలసి వచ్చినది గాని మన కథాభాగమునకు సంబంధించినవాఁడు గాఁడు. 1555 సం॥ ప్రాంతమున నున్నవాఁడు.

కందుకూరి రుద్రయ.

ఈయన విశ్వబ్రాహ్మణుఁడు. నెల్లూరు మండలమున నున్న కందుకూరునగరవాస్తవ్యుఁడు. కాళీవరప్రసాదలబ్ధకవితాధురంధరుఁడు. తొలుదొలుత నీతనికి రాయల సందర్శనము మంత్రులు కలుగనీయ లేదఁట. కొంతకాలమునకు రాయల భృత్యుండగు మంగల కొండోజి యనువాని ప్రాపకమున రాజసందర్శనము చేకూరఁగా నీపద్యముఁ జెప్పెను.

క॥ ఎంగిలిముచ్చు గులాములు
సంగతిగాఁ గులముచెఱుపఁ జనుదెంచిరయా
యింగితమెఱిఁగిన ఘనుఁ డీ
మంగల కొండోజి మేలు మంత్రులకన్నన్.

రాయల సందర్శనము లభించిన వెనుకఁ దాతయాచార్యాదులితని వంచింపవలెనను దురుద్దేశముతోఁ గష్టసాధ్యంబులగు సమస్యలీయఁగా ననాయాసంబున నాసమస్యలన్నిటిని నీరుద్రకవి పూరించెను. అంతట రాయ లీకవివరుని సరసకవితాశక్తి సామర్థ్యముల నెఱిఁగి యీశాన్య సింహాసనారూఢుని జేసెను.

తరువాత మరికొంతకాలమునకుఁ దెనాలి రామలింగనాది కవులితని హేళనచేయవలెనను దురుద్దేశముతో మనమందఱము షికారు

నకు వెళ్ళవలెనని రాయలను ప్రేరేపించిరఁట. రాయలుకూడ సమ్మతించి సప్తకవులను వారివారి వాహనములతో రమ్మని యాజ్ఞాపించఁగాఁ గవులెల్లరును దమతమ వాహనములపై రాజుతోఁ బోవుచు నీరుద్రకవిని గాంచి "మీరింక మేఘవాహనారూఢులు కాలేదేమని" పరిహాసించిరఁట. "నేను వత్తును మీరుపొండని" రుద్రకవీంద్రుండు బదులుచెప్పి తాను గాళికాదేవిని నిశ్చలధ్యాన మొనర్చుచు బయలుదేరఁగా నురుములు, మెరుపులు, పిడుగులతోఁ గూడుకొన్న భయంకరంబగు మహావర్షంబు వర్షింపసాగెనఁట. అంతకుమున్న పట్టణబాహ్య ప్రదేశమునకేగియున్న రాయలు కవులు నీమహావర్షమునకు నైపక తడిసి చెల్లాచెదరై గుట్టకొకరు చెట్టుకొకరు చేరుకొనిరఁట. అంతటఁ దపశ్శాలియగు నీరుద్రకవివరుండు తాను తడియక పొడి గుడ్డలతో రాయలను గవులను గలిసికొనఁగా వారీమహత్త్వంబు రుద్రకవీంద్రునిదిగా నెఱింగి వేడుకొనిరఁట. తరువాత రుద్రయ కటాక్షించి కాళికాదేవిని స్తోత్రముచేయఁగా వెంటనే వర్షమాగిపోయినదఁట. తన మహత్త్వం బెఱుంగక కవులపాటవిని తన్ను నిరసించినాఁడను మహాకోపమున రాయలనుగాంచి రుద్రకవి యీక్రింది పద్యముల నాశువుగాఁ జదివెనఁట.

ఉ॥ తిట్టుమనా భుజంగవిషదిగ్ధదవానలధాగధైగచి
ట్చిట్టచిటార్భటిప్రకటశీఘ్రమహోగ్రితదంతనిష్ఠురో
ద్ఘట్టన విస్ఫులింగలయకారణదారుణబద్ధలుబ్ధరా
ట్పట్టణగోపురధ్వజనిపాతహతాహుతిగాఁగ నుద్ధతిన్.

ఉ॥ తిట్టుదునా మహోగ్రకరతీవ్రవచోవరగద్యపద్యసం
ఘట్టఘురట్టఘట్టవధగా వినిగాచినసైన మానినీ
పట్టణవప్రసౌధమణిబంధురసింధురసైంధవాధ్యులన్
బట్టపురాజులన్ దొరలఁ బండితులన్ దురహంకృతాత్ములన్.

ఉ॥ తిట్టుమనా మహోగ్రకరతీవ్రవచోవరగద్యపద్యసం
ఘట్టఫణీంద్రకోటిఘనకంఠవిషాగ్నులరీతి మెట్టుచున్
నెట్టనదాకఁగావలయు నిందయుఁ జేయక పద్యమిత్తునా
పట్టపురాజరీతి బహుభంగుల లెస్స సుఖింపఁగావలెన్.

కృష్ణదేవరాయ లంత భయభ్రాంతుండై స్తోత్రవాఙ్మాలంబున నాలింగనముఁ జేసికొనఁగా రుద్రకవీంద్రుఁడు శాంతించి రాజును సన్మానించెనఁట.

భట్టుమూర్తి.

ఈయన ప్రౌఢకవితా ధురీణుఁడు. సాహిత్య రసపోషణమందు శ్లేషశబ్దపరిచితియందు విచిత్రశబ్దార్థరచనా చమత్కారమందు నితని కీడుగాఁగలకవి మరియొక్కండు లేఁడని పెద్దలు నిర్ణయించినారు. రామరాజభూషణుండను యితనికిఁ బర్యాయాభిధేయము గలదు. ఇతఁడు భట్రాజులని చెప్పఁబడు క్షత్రియకుల సంజాతుఁడు. ఇక్కవి కృతంబులగు వసుచరిత్రయు హరిశ్చంద్ర నలోపాఖ్యానము సాహిత్య చక్రవర్తులని పేరువడిన పండితులను సైతము చిక్కులుపెట్టఁగల సారస్యము గలిగియున్నవి. కావ్యాలంకారసంగ్రహమను నామాంతరముగల నరసభూపాలీయ మితని కృతంబనియుఁ గాదనియు ధీవిశాలురు రెండు పక్షంబుల వాదించుచున్నారు. వసుచరిత్ర కృష్ణదేవరాయల యల్లుఁడగు నళియరామరాజు తమ్ముఁడు తిరుమలరాయని కంకితము చేయఁబడెను గాన నితఁడు కృష్ణదేవరాయల యాస్థానమునఁగల యష్టదిగ్గజంబులలోఁ జేరిన కవియనుటకు సందేహింపవలసి యున్నది.

తెనాలిరామకృష్ణుఁడు.

ఈయన వికటకవి జటిలకవితా ధురీణుఁడు. మచ్చుకైన వ్యర్థపదంబు లేని సమాససంవిధానముగలిగి రసాభ్యుదయమై హృదయాకర్షకమై సహజమై ధారాళమై యలరారు కవితాధారగలవాఁడని నుతికెక్కినదిట్ట. కృష్ణదేవరాయల వినోదసఖుఁడై ప్రతివిషయమునందుఁ బ్రధానబహుమానముఁ బొందుచుండెడి వాఁడఁట. ఆ కవీంద్రుని గురించి చిత్ర విచిత్రంబులగు కథ లనేకములు గలవు. వానినన్నిటి నాయాతావులఁ జదువుకొని చదువరులు సంతసిలుదురుగాత.

అయ్యలరాజు రామభద్రుఁడు.

అయ్యలరాజు రామభద్రుఁడు కృష్ణదేవరాయలయాస్థానకవియని

యుఁ బెద్దనకవీంద్రుని శిష్యుఁడనియుఁ జెప్పుదురు. కాని యందులకు బలవదాధారము లేమియుఁ గనఁబడకుండుటేగాక రామాభ్యుదయమున గురుస్తుతి నిట్లుచేసినాఁడు.

క॥ పరవస్తువంశరత్నా
కరకౌస్తుభమణి ప్రభావఖనియయి నాకుం
బరమగురువైన ముమ్మడి
వరదాచార్యాంఘ్రివనజవందారుఁడనై.

ఇక్కృవికృతంబగు సకలకథాసారసంగ్రహముకన్న రామాభ్యుదయ మగ్రగణ్యమనియు సర్వోత్కృష్టప్రబంధమనియు వాడుకలో నున్నది. అప్పకవ్యాదు లితని లక్షణవేత్తలలోఁ జేర్కొనినారు.

కృష్ణదేవరాయల నిర్యాణము.

ఇట్టికవి దిగ్దంతులతోఁ గాలముగడపుచుఁ గన్నబిడ్డలపోల్కిఁ బ్రజలంగాపాడి కృష్ణదేవరాయలు 1530 సం॥ కీర్తిశేషుఁ డయ్యెను.

ఉ॥ బోరన యాచకప్రతతి భూరివిపద్దశనందుచుండఁగా
నారయ శాలివాహనశకాబ్దము లద్రియుగాబ్ధిసోములం
దారణవత్సరంబున నిదాఘదినంబున మాఘశుద్ధష
ష్ఠీరవివాసరంబున నృసింహునికృష్ణుఁడుచేరె స్వర్గమున్
ద్వారకనున్నకృష్ణుఁ డవతారసమాప్తిని జెందుకైవడిన్.

రాయల నిర్యాణానంతర మతని సవతితమ్ముఁడగు నచ్యుతదేవరాయలు 1530 మొదలు 1542 వరకుఁ గొండవీటిరాజ్యమును బ్రతినిధులమూలముగాఁ బాలించెను. తరువాత వీనిసోదరుఁడు సదాశివరాయలు 1542 మొదలు 1565 వరకుఁ బైవిధముగానే పాలించెను.

బహామనీ రాజ్యము

ఢిల్లీలో గంగూ యనునొక బ్రాహ్మణునియొద్ద హాసన్ యను వాఁడు బానిసీఁడుగానుండి పొలము దున్నుచుండఁగా నతనికి ధనము చిక్కినదఁట. అంతట హాసన్ దొరకినధనమును తనయజమానియగు

గంగుకర్పించుకొనఁగా గంగుహాసన్ సత్యప్రవర్తనకు మెచ్చి మహమ్మద్ తుఘలక్ కొలువులోఁ జేర్చెను. తరువాతఁ గ్రమక్రమముగా నాతఁడు సేనాధిపతిపదవినార్జించి దక్షిణదిగ్దేశయాత్ర వెడలి స్వతంత్రుఁడై గుల్బర్గలో 1347 సం॥ మొక రాజ్యమును స్థాపించెను. ఇతఁడు గంగూ యను బ్రాహ్మణుని సాహాయ్యమున రాజ్యస్థాపనఁ జేసెఁ గావుననే హాసన్ గంగూ యని పిలువఁబడుచున్నవాఁడు.

ఈ రాజ్యము రానురాను సుబేదారులకుఁ జిక్కినందున వారు స్వప్రయోజన పరులై యొండొరులు గలహించుకొనుటచే నైదు విభాగములుగాఁ జీలినవి. (1) బేరిద్ షాహి; యిది ఖాసింబేరిద్ అను వానిచే నేర్పడియెను. దీనికి రాజధాని బేదర్ లేక బెడందకోట. (2) ఇమాంషాహి; యిది వరాడ్ దేశములోనిది. ఫత్తేఉల్లాయిమాంషా యను వానిచే నేర్పడియెను. దీనికి రాజధాని గావిల్ గడము. (3) నిజాంషాహి; యిది అహమ్మద్ షా యను వానిచే నేర్పడియెను. దీనికి రాజధాని అహమ్మద్ నగరము. (4) కుతుబ్ షాహి; యిది కూలి కుతుబ్ షాహ యను వానిచే నేర్పడియె. దీనికి రాజధాని గోలకొండ. ఈ గోలకొండ రాజ్యము బహామనీరాజ్యమునుండి 1512 సం॥ మున విడిపోయెను. (5) ఆదిల్ షాహి యిది యూసఫ్ ఆదిల్ షాహ యను వానిచే నేర్పడెను. దీనికి రాజధాని విజాపురము. ఈ బహామనీరాజ్యపు సుల్తానులలో బిరారుసుల్తాను దప్పఁ దక్కిన నలుగురు సుల్తానులును గలిసి 1565 సం॥ మున విజయనగరముమీఁదికి దండువెడలి తాళికోటయుద్ధములో సదాశివరాయల నోడించి యతని రాజ్యనిర్వాహకకర్తయుఁ గృష్ణరాయని యల్లుఁడు నగు యళియరామరాజును సంహరించి కర్నాటరాజ్యములోఁ గొంతభాగము స్వాధీనము చేసికొనిరి. ఇట్లు వశపరచుకొనిన వెనుక కుతుబీశాహివంశమునందు మూఁడవరాజగు ఇబ్రహీమనెడి గోలకొండ ప్రభువునకుఁ గొండవీటిరాజ్యము సంక్రమించెను.

మహమ్మదీయుల పరిపాలనము, కుతుబ్‌శాహివంశము.

కుతుబ్‌షా యను వాఁడు 1512 సం॥ మొదలు 1543 వరకు బహమనీరాజ్యమునుండి గోలకొండరాజ్యమును వేరుపరచి పాలించెను. ఈ కుతుబ్‌షాపేరటనే యీ వంశము కుతుబ్‌శాహివంశ మనఁబడుచున్నది. ఇతని తరువాత వీని రెండవ కుమారుఁడు జామ్‌షేద్ 1543 సం॥ మొదలు 1550 వరకు రాజ్య మేలినాఁడు. వీని పిమ్మట నితని తమ్ముఁడగు ఇబ్రాహీంషా 1550 సంవత్సర మీ గోలకొండ సింహాసనమెక్కి కొండవీటిరాజ్యమును సంపాదించి 1565 సం॥ వరకుఁ బరిపాలించెను. ఈ యిబ్రాహింసానే యిభరాంషాయనియుఁ గల్కిభరాం అనియుఁ జెప్పుదురు. ఇతఁడు మహాదాత. ఆంధ్రకవిత్వము నం దత్యంతప్రీతిగలవాఁడు. కృష్ణదేవరాయల యాస్థానకవియని యిదివరకుఁ జేర్పఁబడిన కందుకూరి రుద్రకవివంశపరంపరలోఁ జేరిన వాఁడైన రుద్రకవికి రెంటచింతలయను గ్రామము సర్వాగ్రహారముగా నొసంగెను. మరియుఁ బొన్నగంటి తెలగనార్యుఁ డను కవి రచించిన యయాతిచరిత్రమను నచ్చతెలుఁగు ప్రబంధమునకును, అద్దంకి గంగాధరకవిచే రచియింపఁబడిన తపతీసంవరణోపాఖ్యానమునకును నితఁడు కృతిభర్త. ఎల్లప్పుడు కవీశ్వరులగోష్ఠియందే కాలముగడపి వారికవిరాళములైన ధన మొసంగి కృష్ణదేవరాయలకుఁ దరువాత నాంధ్రభాష నుద్ధరించిన మహానుభావుఁడు; కావుననే యాంధ్రకవీంద్రు లీతని నీవిధముగాఁ బొగడినారు.

సీ॥ నవ్వేనా సంగీతనాదభేదవిధిజ్ఞ
ధీరాత్ములకుఁ బదినూరులిచ్చు
రమ్మనెనా సభాప్రౌఢసత్కవివర
జాలములకుఁ బదివేలనిచ్చు
కూర్చుండుమనియెనా గురుతరశాస్త్రజ్ఞ
లక్షణవిదులకు లక్షయిచ్చు

సాబాసురాయన్న సకలశ్రితానేక
కోవిదులకు మెచ్చి కోటియిచ్చు
గీ॥ బళిర చతురబ్ధిమేఖలా కలితధాత్రి
చక్రినిర్వక్రపాలనాచారుకీర్తి
రమ్యముక్తాతపత్రరారాజితుండు
చారుతరమూర్తి యిభరాముచక్రవర్తి.

సీ॥ కర్నాటకాధీశు కంఠమాలికమీఁదఁ
గుదురుగా ముత్యాలగొడుగుమీఁద
వింధ్యదేశాధీశు వెల్లవల్వలమీఁద
గౌళేశు వజ్రాలగద్దెమీఁద
పాంచాలభూమీశు పట్టుపల్లముమీఁదఁ
బాండ్యభూపతి వెండిబరణిమీఁద
బంగాళజననాథు పాంచజన్యముమీఁదఁ
గురురేంద్రు ధవళగోళకముమీఁద
తే॥ ఆడి పాడించు నటియించు నఘువళించు
మెచ్చి కుప్పించుఁ గెరలించు మేబళించు,
సంతసంబున నీకీర్తి జలజనేత్ర
మానవోపేంద్ర యిభరాముమండలేంద్ర.

ఉ॥ రాజును రాజుగాఁడతఁడు రాహుముఖంబునఁజిక్కె; వాహినీ
రాజును రాజుగాఁడతఁడు రామశరాహతిఁదూలె; దేవతా
రాజును రాజుగాఁడతఁడు రావణుసూతికి నోడె నాజిలో
రాజన రాజు మల్కియిభరాముఁడె రాజు ధరాతలంబునన్.

ఉ॥ రాముఁడు దుక్కిముచ్చు, రఘురాముఁడు క్రోఁతులరాజు, రేణుకా
రాముఁడు పోటుబంటు, పటురాగసమంచితుఁడైన గోపికా
రాముఁడు వెట్టిగొల్లఁ డీకరాష్ట్రములందు సమాను లేరయా
రాముల నెంచిచూడ నిభరామమహీధవ! భవ్యవైభవా!

ఈ రాజపుంగవుని తరువాత మహమ్మద్ కుతుబ్‌షా 1581

మొదలు 1611 వరకును, అబ్దుల్ హుస్సేన్ 1611 మొదలు 1687 వరకును గోలకొండనవాబులుగానుండి కొండవీటిసీమ నేలిరి.

ఢిల్లీచక్రవర్తులగు మహమ్మదీయుల పరిపాలనము,

ఈఢిల్లీపాదుషాహాలను మఘుల్ చక్రవర్తు లందురు. బాబర్ మఘుల్ వంశపు మొట్టమొదటిచక్రవర్తి. ఇతని శైశవమునఁ దండ్రి గతించుటచే నీతఁ డనేకకష్టములఁబొందెను. ఇతఁడు గుణశాలియై విద్యాభిమానియై 1526 మొదలు 1530 వరకు ఢిల్లీ రాజ్యాధిపతియై యుండెను.

హుమాయూన్.

హుమాయూన్ బాబరునకుఁగుమారుఁడు. ఇతఁడు తనతండ్రి యనంతర మీఢిల్లీసింహాసనమెక్కెను. ఇతఁడుదయాస్వభావుఁడై తన యనుజులకును దనకును నన్యోన్యస్నేహము పొసంగుటకై వారికిఁ గొంతరాజ్యమిచ్చి ప్రజలయెడలఁగనికరముగలిగి మతవిషయములందుఁ బక్షపాతమువహింపక సర్వమతముల నేకదృష్టి విలోకించి సకలప్రజాసమ్మతుఁడై రాజ్య మేలుచుండఁగా 1540 సం॥ మున ఆఫ్గను ప్రభువగు షర్ ఖాన్ యనువాఁడు గొప్ప సేనతో దండువెడలి హుమాయూన్ చునార్ గడము (కోట) వశపరచుకొనియెను. అప్పుడీ హుమాయూన్ చక్రవర్తికిని షర్ ఖాన్ ప్రభువునకును బౌసా యను పట్టణమువద్ద ఘోరమగు యుద్ధము జరిగి హుమాయూన్ రాజ్యము వదలి పారిపోయి తన యనుజులసహాయసంపత్తిఁ గోరఁగా వారు నిరాకరించిరి. అట్టియెడఁ దన్నుఁ గాపాడువారు లేక దిక్కుమాలినవాఁడై హుమాయూన్ చక్రవర్తి కొంతపరివారముతో నిండుగర్భిణి యగు హామీదా బేగమను తన భార్యతో రాజపుత్రుల సాయ మపేక్షించుటకై సింధుదేశమునకు మహారణ్యమార్గముల నడయాడుచుఁ జేరెను. శుష్కశిలాకంటకావృతమగు నయ్యరణ్యమార్గమునఁ బోవునపుడు హుమాయూన్ బరిచారకులలోఁ బెక్కురు దాహమునకు సైఁకకయుఁ దిండిలేకయుఁ బ్రయాణప్రయాసల భరింపలేకయు మరణించిరి. ఇట్టి

యిక్కట్టులకు లోనై హుమాయూన్ రాజపుత్రుల వేఁడుకొనినను వారలందుల కంగీకరింపరైరి. అంత [illegible]ములైనకష్టములువడియు నెచ్చెచ్చటనో దిరిగియు విసిగి వేసారి తుదకుఁ ఉమర్కోటచేరెను. అచ్చటనే 1542 సం॥ మున జగత్ప్రసిద్ధుఁడగు నక్బర్ జనియించినాఁడు.

చక్రవర్తులకుఁ బుత్రజనన మహోత్సవముల సలిపి తమ భృత్యులకు బహుమానము లొసంగుట సార్వాచారమై యుండ నట్లు సలుపుటకుఁ జక్రవర్తియని నామమాత్రావశిష్టుఁడైన హుమాయూన్ నీచస్థితినున్నవాఁడు గావునఁ బ్రస్తుత మతనియొద్దనున్న కస్తూరినిగొని భృత్యులకుఁ బంచియిచ్చుచు భగవంతుని నిట్లుప్రార్థించెనఁట. సహజశక్తిసామర్థ్య సమేతుండవైన యో పరమేశ్వరా! యీకస్తూరి పరిమళించునట్లు నాకుమారుని కీర్తిప్రతాప సద్గుణరాజంబులు సర్వలోకంబులఁ బరిమళింపఁజేయుము.

తదనంతరము కొలదికాలమునకు హుమాయూన్ చక్రవర్తి ఉమర్ కోట వదలి పర్షియాదేశమున కేగెను.

షర్ ఖాన్ పరిపాలనము.

షర్ ఖాన్ 1540 మొదలు 1545 వరకు ఢిల్లీరాజ్యమును బాలించెను. ఇతఁడు మహామేధావియు విమర్శనాశక్తిగలవాఁడునై హిందూ మహమ్మదీయులకుఁ బరస్పరస్నేహము లొనగూర్చెను. ఇతఁడు బెంగాలునుండి పశ్చిమోత్తరముగాఁ బెద్దరాజమార్గము నేయించి మార్గమునకు రెండువైపుల నీడకై చెట్లనాటించెను. ప్రయాణికుల కుపయోగమునకై యీబాటకు మధ్యమధ్య భావులు త్రవ్వించెను. వ్యవసాయాభివృద్ధికి నీటివసతి కావలసినంతవరకుఁ బొందుపఱచెను. ఇండియాయందు నంచెలమీఁద జాబులుకొనిపోవుపద్ధతి మొట్టమొదట చేసిన దీతఁడే ?

హుమాయూన్ మరల ఢిల్లీరాజ్యమును జయించుట.

హుమాయూన్ పర్షియాదేశమునకేగి యారాజు సహాయమును బొంది 1555 సంవత్సరమున నిండియాపైకి దండెత్తివచ్చెను. అప్పటికి

షర్షాకా మరణించియుండి లుఁడగు వానివంశికుఁడు ఢిల్లీసింహాసనా
ధిపతిగానుండఁగాహుమా చక్రవర్తి వానిని సులభముగాజయిం
చిఢిల్లీసింహాసనమెక్కియు క్సరముమాత్రమే జీవించియుండి 1556
నొకనాఁడు మిద్దెమెట్లను లుజారి క్రిందఁబడి మరణించెను. అనం
తర మీతనికుమారుఁ బాలుఁడగుటవలన హుమాయూన్
చక్రవర్తితోఁబుట్టు భర్త గు బైరాంఖాన్ యనువాఁ డగ్బరునకు రక్షకుఁడై స్వభాషాసాహిత్యంబును నన్యభాషా ప్రవేశంబును రణవిద్యా ప్రభావంబును నేర్పించి రాజ్యమునకు శాత్రవులవలన ద్రోహంబు కలుగకుండఁ గాపాడుచువచ్చెను. కాని యీబైరాంఖాన్ క్రూరస్వభావముగలవాఁడుగాన దయాదాక్షిణ్యములు లేనివాఁడుగా నుండుటచే నగ్బరు తనపదునెనిమిదవయేట స్వయముగా రాజ్యాధిపత్యము వహించెను. అగ్బరుచక్రవర్తి సుగుణములఁగాని ప్రజాపరిపాలనా విధానముఁగాని యిట్లుండునని వర్ణింప శక్యముగాదు. ఈ మహాచక్రవర్తిని గురించి మహారాజ రాజశ్రీ రాయబహదూర్ కందుకూరు వీరేశలింగము పంతులుగారీక్రిందివిధముగా వ్రాసినారు.

అగ్బరు చక్రవర్తి.

రమారమి మూఁడువందల సంవత్సరములకు ముందు మనభారతదేశమున నుత్తరభాగమును మొగలాయి ప్రభువు లేలుచుండిరనుట యందరకును సువిదితమేగదా! అట్లు ఢిల్లీపట్టణమును రాజధానిగాఁ జేసికొని ప్రభుత్వముచేసిన మొగలాయీ రాజులలో అగ్బరుపాదుషాగారు సర్వాతిశాయిమహిమాంచితుండును సువిశాలయశోభాసియునై పెంపెక్కె. ఈలోకమందెన్ని రాజ్యములోఁ బ్రతిష్ఠితములైనవి. ఎందఱు రాజులో యేలుఁబడిచేసిరి. కాని వారందఱిలోను ప్రజారాధనతత్పరతయు నీశ్వరభక్తియుఁ గలిగి రాజ్యపాలనముచేసిన మహాత్ములెంతయు నల్పసంఖ్యాకులే. అట్టివారిలో అగ్బరుపాదుషాగారు ప్రముఖులని చెప్పఁదగును. వారి దొరతనపుమహిమ ఈక్రిందివిధముగ వర్ణితమైయున్నది. అగ్బరుపాదుషా సంస్థానమునకు సమానముగాఁ జెప్పుటకు ముందుగాని పిమ్మటఁగాని మఱియొకటిలేదు. అది తనకు సాటియును

హెచ్చును లేనిది. దానియందున్న రత్నములును వెండిబంగారములును మఱెక్కడ నుండలేదు. అవి యమూల్యములై యగణితములై యుండెను. సుశిక్షితంబును దేశసంరక్షణక్షమంబును నగు నొక గొప్ప సైన్య మెప్పటికిని రాజ్యమున సుస్థిరముగ నుండెను. అగ్బరుపరిపాలనా కాలమున దేశమునందంతటను నాగరకత నెలకొనియుండెను. మొగల్ జాతివా రందరును గౌరవమును గీర్తిని గోరువారై యుదారులై యుండిరి. ఢిల్లీపట్టణమున వాసముచేసిన ప్రభువు లందఱును గోటీశ్వరులు. వారు ధరించు రత్నాభరణములును సరిగపూవుల పట్టువస్త్రములును నమూల్యములు నతిమనోహరములు నై యుండెను. వారి కొక్కొకరికిని బనివాండ్రధమపక్షమేగు రుండురఁట. ఈ వేడుకను జూచునపుడు ఢిల్లీపట్టణమునఁ బెక్కండ్రు చక్రవర్తులు వచ్చి చేరియున్నటుల దోఁచునేకాని, ఒకేరాజు వాసముచేయునటులఁ దోఁచదు. రాజ్యపాలనమునం దగ్బరుపాదుషా సమర్థులగు ప్రభులను బండితులను సహాయులనుగాఁ జేసికొనియుండెను.

ఆకాలమున విద్యకున్నమేలిమియు గౌరవము నేకాలమునను నుండియుండలేదు. రాజునౌదార్యమును రసికతయు విని దేశాంతరములయందుండియుఁ బలువురు విద్వాంసులు ఢిల్లీపట్టణమునకు వచ్చి వాసము చేయుచుండిరి.

ఈమహావేత్తయేలుబడియందు రాజ్యమునందంతటను విద్యాశాలలు స్థాపింపఁబడియెను. అప్పటివిద్యాపద్ధతి యెంతయు సులభమై అనింద్యమగు దేశాభిమానమును రాజభక్తిని గల్గువదియైయుండెను. అప్పటిపాఠశాలలలో నెవరికిష్టమైనవిద్యలు వారు నేర్చుకొనుచుండిరి. ఇప్పటివలె బహుకాల మన్యభాషాపరిశ్రమయందు వ్యర్థపుచ్చ నక్కఱ లేకుండెను. పారసీకదేశస్థులకావ్యములును, అరబ్బీలశాస్త్రములును, ఇంక నితరదేశీయులమతాచారగ్రంథములును నానాహైందవభాషల వ్రాయఁబడియుండెను. ఇట్లధికవ్యయప్రయాసములేకయే జనులు విద్యావంతులై నాగరకతఁబొందియుండిరి. అగ్బరుపాదుషా ప్రజల

మనము లుల్లసిల్లునట్లుగా నిష్పక్షపాతముగా భువినేలుచుండెను. ఎండకాలమున యమునానది వట్టిపోవుటచేత దానిమీఁదఁ బ్రయాణము చేయుటకుఁగాని వర్తకముచేయుటకుఁగాని యనుకూలముగా నుండెను. ఆతఁడీవిషయమును దెలిసికొని ఢిల్లీనగరమునువిడిచి ఆగ్రానగరమును రాజధానిగాఁ జేసికొనెను. అప్పుడాపుర మసంఖ్యేయములగు నున్నత సౌధములచేతను నెంతయు దర్శనీయమైయుండెను. ఈమోగల్ రాజన్యపుంగవుఁ డనేకములగు సుందరమందిరముల నిర్మించెను. ఆగ్రాపట్టణమునుండి ఢిల్లీకిఁబోవుమార్గమున నిరువదిమైళ్ళదూరమున నిసుకదిబ్బమీఁద నితఁ డొకమేడ కట్టించెను. దానిచుట్టుకొలత యాఱుమైళ్ళు. ఈమేడలో మృగముల నొండొంటితోఁబోట్లాడించి యతఁడు వేడుకచూచుట వాడుక. అదికాలవశమున శిథిలమాయెను. ఇప్పుడు మొండిగోడలుగామాత్ర మున్నది. ఇట్లే యిరువదిమైళ్లుచుట్టుకొలతగల యొకకోనేరును పాడుబడి కానవచ్చుచున్నది. అగ్బరుపాదుషాయొక్క యాస్థానమున అబ్దుల్ ఫెజల్, ఫేజ్, అనునిరువురు సోదరులు సమర్థులైన మంత్రులుండిరి. వారిలోఁ బ్రథముఁడు రాజనీతివిశారదుఁడు. ద్వితీయుఁడు కవితల్లజుఁడు. ఈసహోదరు లిద్దరును బరిపాలకపాలిత ప్రేమవిశ్వాసభాజనులై యుండిరి. వార ప్పటిజనసంఖ్య, మతములు, కళలు, విద్యలు, రాజ్యాంగము, ఆదాయవ్యయములు మొదలయిన వానిని వర్ణించుచుఁ బుస్తకముల రెంటినివ్రాసిరి. అగ్బరుమహాత్ముఁడు విశాలహృదయుఁడు. లోకహితైకతత్పరుఁడు. అతనిపరమతసహనగుణ మదృష్టపూర్వము. ఈశ్వరభక్తి అనూనము, అసాధారణము. అతని ప్రారంభములు జగత్క్షేమంకరములు. ఈశ్వరప్రీతికరములు. అతఁడు హిందువులకును మహమ్మదీయులకును నుండినద్వేషమును బోఁగొట్టి యైకమత్యముఁ గలిగింపఁ బ్రయత్నించెను. దీనికైయాతఁడు హిందువులనియు మహమ్మదీయులనియు భేదముపెట్టక యీరెండుమతములవారికిని గొప్పయుద్యోగము లిచ్చుచుండెను. ఇంతియగాక యతఁడు హిందూసంస్కరణముఁగూడఁ జేసెననిచెప్పఁదగును. హిందువులలో బలియిచ్చుట, క్రూరప్రమాణములుచేయుట, అతిబాల్యవివాహములు.

బలాత్కారసహగమనము, నిర్బంధవైధవ్యము మొదలగు దురాచారముల మాన్పింపఁజూచెను. అగ్బరుపాదుషాగారు వార్ధక్యమునఁ గేవలముపుణ్యక్రియలయందే గాలక్షేపము చేయుచుండెను. అతఁడు చనిపోవుటకుమునుపు ప్రభువులనందరిని బిలిపించి వారందఱుఁదనయెదుట వచ్చిచేరినపిమ్మటఁ, దా నేవైనఁ దప్పులుచేసియుండిన క్షమింపవలయునని వారినిఁబ్రార్థించెను. పదంపడి కుమారునిబిలిచి యాలింగనము చేసికొని యొడలుతడవి "నాప్రియపుత్రుఁడా! నేను కడసారిసెలవు తీసికొనెదను; నా అంత్యవాక్యముల వినుము; కాపులకు మేలుఁదలఁపోయుము. ఆశ్రితుల విడనాడకుము. అసన్మార్గమును మెట్టకుము. అన్నిటిని మనముననుంచుకొని నన్ను మఱువకుము" అనిబుద్ధిచెప్పి ఈశ్వరధ్యానముచేసి 1605 సం॥ అక్టోబరునెల 10 వ తేదీ రాత్రి పరలోకగతులయిరి.

జహంగీర్.

జహంగీర్ అగ్బరుచక్రవర్తికుమారుఁడు. ఇతఁడు 1605 మొదలు 1627 వరకు రాజ్యమేలెను. ఇతఁడు హిందూసుందరీమణుల ననేకులను వివాహమాడుటేగాక నూర్జహానను పారసీకస్త్రీని బెంట్లాడి యామెను విశేషముగాఁబ్రేమించెను. నూర్జహాను విశేషవివేకవతి. దూరదృష్టిగలది. రాజ్యనిర్వాహణమునందు భర్తకు సహాయురాలై ప్రజలను నెమ్మదిగాఁ బరిపాలింపఁజేసెను. జహంగీర్చక్రవర్తికడకు నాంగ్లదేశపురాజయిన మొదటిజేమ్సు ఆంగ్లవర్తకులు హిందూదేశమున వర్తకముచేసికొనుటకై యుత్తరువు కోరుటకుఁగాను సర్. థామస్‌రో యనురాయబారి నంపెను. ఈసర్ థామస్‌రో జహంగీర్ సంస్థానమునందు మూఁడువర్షములుండి జహంగీర్ చక్రవర్తిపరిపాలనావిశేషములను జరిత్రపూర్వకముగా వ్రాసినాఁడు.

షాజహాన్.

షాజహాన్ జహంగీర్చక్రవర్తికుమారుఁడు. తండ్రికన్నను నీతఁడపూర్వమైన శౌర్యపరాక్రమంబులు గలవాఁడు. తనతాత యగు

నక్బరుచక్రవర్తివలెనే సర్వవిషయంబులఁ బ్రజలనెల్లరను గన్నబిడ్డల పోల్కి సత్యదీక్షతో నిష్పక్షపాతబుద్ధిగలిగి పరిపాలించినాఁడు. ఇతని పరిపాలనాకాలమునందుఁ బండితులకును గవులకును సంస్థానమునందు మంచిగౌరవ ముండెడిది. రాజకీయోద్యోగులెల్లరు గౌరవమును గోరువారై యుదారస్వభావులై ప్రవర్తించుచుండెడివారు. రాష్ట్రసౌభాగ్యంబు దినదినప్రవర్ధమానమై విరాజిల్లుచుండెడిది. ఇతఁడు ఢిల్లీలో జగత్ప్రసిద్ధమైన జుమ్మామజీద్, దివానిఖాస్(భూర్వస్వర్గము)మోతీమజీద్(ముత్యాలమజీదు) అను మూఁడువిచిత్రములగు భవనములును లాహోరులో సాలిమార్ నందనవనమును గట్టించెను. తనభార్యయగు మంతాజమహల్ చనిపోవఁగాఁదద్జ్ఞాపకార్థమై యామె గోరీమీఁద షహజహాన్ చక్రవర్తి నానాదేశములనుండి శిల్పశాస్త్రనిపుణుల రావించి యపారమగు ధనము వెచ్చించి నవరత్నములతో విచిత్రమగు కట్టడమును నిర్మింపం జేసెను. ఇట్టిచాతుర్యమైనది ప్రపంచములోనెక్కడను లేదఁట. ఇప్పటికిని నిన్ననో మొన్ననో నిర్మించినట్లుండి చూపరుల చిత్తంబు జల్లుమనిపించునఁట. ఒకానొకసమయమున షాజహాన్ చక్రవర్తికుమారిత రుజాపీడితయైయుండఁగా నంతకుమున్నే మన దేశప్రవేశమునుగలుగఁజేసికొనియున్న యింగ్లీషువారిలో వైద్యుఁడగు బౌటన్ యనువానిని జక్రవర్తి పిలిపించి తనకుమార్తెవ్యాధిని గుదుర్చుమని కోరెను. బౌటన్ వ్యాధినిమ్మళింపంజేసి తనకుబహుమానముగాఁ దూర్పుఇండియాసంఘమువారికి సుంకమేదియులేకుండ బెంగాలులో వర్తకముచేసికొనుటకు స్వతంత్రాధికారమీయవలెననికోరెను. అందులకుఁ బాదుషా సమ్మతించి బాలసూర్ పూరి మొదలగుప్రదేశములందు కార్ఖానాలు కట్టుకొనునటు లుత్తరువొసంగెను.

ఔరంగజేబ్.

ఇతఁడు షహజహాన్ చక్రవర్తి కుమారుఁడు. ఇతఁ డలంఘీర్ యను బిరుదముతో 1658 సం॥ మున సింహాసనమెక్కెను. ఢిల్లీ చక్ర

ర్తులలో నీతఁ డసాధారణ ప్రజ్ఞగలవాఁడు. ఏకార్య నిర్వాహమునను ప్రాలుమాలిక యించుకేనియు లేనివాఁడు. కాని మతవిషయములందు న్యాయము ననుసరించినవాఁడు గాదని కొందరువ్రాతురు. ఇతఁడు 1868 సం॥ బిజాపురమును ముట్టడించి స్వాధీనపరచుకొనెను. తరువాత 1687 సం॥ గోలకొండ రాజ్యముపై దాడివెడలి అబ్దుల్ హుస్సేన్ ప్రభుత్వ మంతరింపఁజేసి వశపరచుకొనియెను. కావున మన కథాభాగమగు కొండవీటిరాజ్యము ఢిల్లీసామంతరాజ్యముగా మారినది. ఔరంగజేబ్ తరువాత ఢిల్లీసింహాసనమెక్కిన మొఘుల్ చక్రవర్తియగు ముహమ్మద్‌షా యేలుబడికాలమందు దక్కనులో రాజప్రతినిధిగానున్న నిజాం ఆలీఖాన్ (నిజాముల్‌ముల్క) అను ముహమ్మదీయ సరదారుఁడు హైదరాబాదునందు స్వతంత్రించి 1724 సం॥ మందు నూతనరాజ్యము స్థాపించినాఁడు. (ప్రకృతపు హైదరాబాదు నిజాంగారీనిజాముల్‌ముల్క వంశపరంపరలోని వారే) కావునఁ గొండవీటి రాజ్యము నిజాం ఆలీఖాన్ పాలనలోఁ జేరినది. వీని తరువాతనితని ద్వితీయపుత్రుఁడైన నాజర్‌జంగ్‌ను దౌహిత్రుఁడగు ముజఫర్‌జంగును సింహాసనమునకై పోరాడఁగా ముజఫర్‌జంగ్ పక్షమున ఫ్రెంచివారును నాజర్‌జంగ్ పక్షమున నింగ్లీషువారును జేరినందునఁ గలహ మారంభింపఁబడియె. ఇంతలో నాజర్‌జంగ్ హఠాత్తుగాఁ జనిపోవుటచేత ఫ్రెంచివారు ముజఫర్‌జంగ్‌ను సింహాసన మెక్కించిరి. ఈముజఫర్‌జంగ్ 1751 మరణింపఁగా ఫ్రెంచివారు నాజర్‌జంగ్ తమ్ముఁడగు సలాబత్‌జంగ్‌ను నిజాముగాఁజేసిరి. ఈతఁడు తనకు ఫ్రెంచివారు చేసిన యుపకారమునకుఁ బ్రత్యుపకారముగాబుస్సియను ఫ్రెంచిసేనానిసిదనకు నాలోచనకర్తగా నుంచుకొని 1753సం॥యీబుస్సీకి నుత్తరసర్కారుల ననఁగా నిప్పటిగోదావరి విశాఖపట్టణము కృష్ణా గుంటూరు గంజాము మండలములను స్వాధీనపఱచి యీజిల్లాలనుండి వచ్చు శిస్తు వసూలు చేసికొనుట కధికారమిచ్చెను. కావునఁ గొండవీటిరాజ్యము ఫ్రెంచివారికి లోఁబడియున్నది. ఇట్టిసమయమున ననఁగా 1761 సం॥ సలా

బత్ జంగ్‌ను జంపి వాని తమ్ముఁడగు నిజామల్లీయనువాఁడు హైదరాబాదులోఁ బ్రభువాయెను.

అప్పుడు బంగాళాదేశమునయున్న రాబర్టు క్లైవనెడి యింగ్లీషు వీరుఁడు కల్నల్ ఫోర్డనువానిని నుత్తర సర్కారులమీఁదికిఁ బంపఁగాఁ, గొండూరియొద్ద ఫ్రెంచిసేనల నోడించెను. అందువలన నచట నింగ్లీషువారు ప్రబలులైరి.

1765 సం॥ నిజాము ముర్తుజా నగరు సర్కారు గుంటూరు మండలము గాక నుత్తరసర్కారులలో నున్న నాలుగు మండలములను నింగ్లీషువారికిచ్చి గుంటూరు మండలము మాత్రము తన తమ్ముఁడగు సలాబత్ జంగ్‌నకు జీవితాంతమువరకు జాగీరుగా నియమించి వాని యనంతర మింగ్లీషువారికిఁ జేరునట్లు విధించెను.

కాని కొన్ని కారణములచేత గుంటూరు మండలమును సలాబత్ జంగ్ జీవించియుండఁగానే 1788 సం॥ యింగ్లీషువారు స్వాధీన పఱచుకొనినారు. నాఁటినుండి నేఁటివరకును గొండవీటిరాజ్యము వారి పాలనలో నున్నది.

చ॥ అలుఁగు లవెన్ని యేటికిని? సంచితమైన విశాలభూమిపైఁ
గలుఁగు లవెన్ని పాముసకుఁ? గానలవెంబడి సంచరించు నా
పులుఁగున కెన్నివృక్షములు? పొల్పువహించిన భూధరాళిలో
నెలుఁగున కెన్నిరోమములు? ఏలిక లందఱు కొండవీటికిన్.

కన్యకా ముద్రాక్షరశాల, గుంటూరు.

కన్యకా ముద్రాక్షరశాల,

గుంటూరు.

సంస్కృతాంధ్రాంగ్లేయ గ్రంథములు, నాటకములు, నవలలు మున్నగునవి నిర్దుష్టముగను, యథేష్టముగను, దర్శనీయముగను గోరినకాలములో సరసములగు రేట్లకు ముచ్చటగ ముద్రింపఁగలము.

మే మిక్రింద వివరించిన పనులనుగూడఁ జేయుదుము.

శుభలేఖలు ప్రకటనలు, హుండీపుస్తకములు, లెటరుపేపర్లు, కార్డ్లు, కవర్లు, రబ్బరుస్టాంపులు, క్యాలండర్లు మొదలగునవి.

ఈ అచ్చుపనులన్నియు నలుపు, ఎఱుపు, నీలము, పసుపు, పచ్చ, ఊదా మొదలగు ననేకరంగులలోఁ గోరినప్రకారము ముద్రింపఁగలము గానఁ దద్జ్ఞులు గ్రహించి మాయొద్దనే అన్ని అచ్చుపనులు చేయించుకొందురని మనవి చేయుచున్నాము.

ఇట్లు విధేయులు,

పి. చక్రపాణి అండ్ బ్రదర్సు,

గుంటూరు.

END OF
TITLE